

ప్రసంగిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

పేదలకు అత్యుత్తమ వైద్యం

- కార్పొరేటు ఆస్పత్రులకన్నా మిన్నగా ఎయిమ్స్
- వర్చువల్‌గా మంగళగిరి ఎయిమ్స్‌ను ప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోదీ

మంగళగిరి, ఫిబ్రవరి 25: ఎయిమ్స్‌లో పేదలకు ఉన్నత స్థాయి వైద్య సేవలు అందించేలా రూపొందించామని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. మంగళగిరిలో రూ 1618.23 కోట్ల వ్యయంతో నిర్మించిన అఖిల భారత వైద్యవిజ్ఞాన సంస్థ(ఎయిమ్స్) ఆస్పత్రిని ఆయన వర్చువల్‌గా ఆదివారం ప్రారంభించారు. రాజ్‌కోట్ నుంచి ఆయన రిమోట్ కంట్రోల్‌తో ఆరంభించి ఎయిమ్స్‌ని జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు. గతంలో ఢిల్లీకి మాత్రమే పరిమితమైన ఎయిమ్స్‌ను నేడు దేశంలోని 22 ప్రాంతాల్లో ఏర్పాటు చేశామన్నారు. దేశీయ వైద్యరంగంలో అత్యున్నతమైన వైద్యసేవలు అన్ని ప్రాంతాల వారికి సులువుగా అందుతాయన్నారు. ఈ ఆస్పత్రులను ప్రైవేటు రంగంలోని కార్పొరేటు ఆస్పత్రులకన్నా మిన్నగా రూపొందించామన్నారు. మంగళగిరి ఎయిమ్స్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ కింద క్రిటికల్ కేర్ హెల్త్‌బ్లాకులను గుంటూరు ప్రభుత్వ వైద్యకళాశాలలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. కోవిడ్ సమయంలో మంగళగిరి ఎయిమ్స్ అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. డబ్బు కన్నా ఆరోగ్యమనేది ప్రతి మనిషికి చాలా ముఖ్యమన్నారు. వైద్యం అందరికీ అందాలన్న లక్ష్యంతో ఎయిమ్స్ అనేక రకాల కార్యక్రమాలను చేపడుతుందని గవర్నర్ వివరించారు. కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ సహాయ మంత్రి డాక్టర్ భారతీ ప్రవీణ్‌పవార్ మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ పథకం కింద దేశంలో ఇప్పటికే 15 కోట్ల మందికి వైద్యసేవలను అందిస్తున్నామన్నారు. తల్లీబిడ్డల ఆరోగ్య సంరక్షణకు కేంద్రం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు.


గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కేంద్ర మంత్రి భారతీ పవార్

41 విభాగాలు.. 13 సూపర్ స్పెషాలిటీ విభాగాలు

మంగళగిరి ఎయిమ్స్‌లో మొత్తం 41 వైద్యవిభాగాలతోపాటు మరో 13 సూపర్ స్పెషాలిటీ విభాగాలను అన్ని హంగులతో ఏర్పాటు చేశామని డైరెక్టర్ డాక్టర్ మధబానందకర్ తెలిపారు. 183 ఎకరాల విస్తీర్ణంలో అంతర్జాతీయ ప్రమాణాలతో 960 పడకల ఆస్పత్రిగా కేంద్రం నిర్మించిందన్నారు. ఈ ఆస్పత్రికి అనుబంధంగా 125 సీట్లతో కూడిన వైద్యకళాశాల, మరో నర్సింగ్ కళాశాల పనిచేస్తుందన్నారు. ప్రాంగణంలో ఎకడమిక్ కాంప్లెక్స్ ఓపీడి బ్లాక్, ఐపీడీ బ్లాక్, అత్యవసర సేవల విభాగం, రెసిడెన్షియల్ బ్లాక్, హాస్టల్ బ్లాక్, గెస్ట్‌హౌస్, లైబ్రరీ, ఎడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, ధర్మశాల భవనం, ఆయుష్ బ్లాక్, అధునాతన సౌకర్యాలతో ఆడిటోరియం తదితరాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కేంద్ర బొగ్గు గనులు పార్లమెంటరీ వ్యవహారాల శాఖమంత్రి ప్రహ్లాద్ వెంకటేష్ జోషి, కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ సహాయమంత్రి డాక్టర్ భారతీ ప్రవీణ్‌పవార్, రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, ఎంపీ బీవీ సత్యవతి, రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్, జీవీఎల్ నరసింహారావు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, ఎయిమ్స్ అధ్యక్షుడు టీఎస్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



గుంటూరు.. వికసిత రైల్వేస్టేషన్

- అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి
- నేడు వీడియో లింకు ద్వారా ప్రారంభించనున్న ప్రధాని మోదీ

గుంటూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్(ఏబీఎస్ఎస్) కింద గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని పలు రైల్వేస్టేషన్ల రూపురేఖలను కేంద్ర ప్రభుత్వం సమూలంగా మారుస్తోన్నది. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో తీర్చిదిద్దుతోన్నది. ఈ నేపథ్యంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ దేశ వ్యాప్తంగా ఏబీఎస్ఎస్ కింద చేపట్టిన రైల్వేస్టేషన్ల నవీకరణ పనులకు శంకుస్థాపన/ప్రారంభోత్సవాలను సోమవారం వీడియో లింకు ద్వారా చేపట్టనున్నారు. గుంటూరు రైల్వేస్టేషన్‌తో పాటు డివిజన్‌లోని మరో 20 చోట్ల ఇందుకు సంబంధించి ఏర్పాట్లు చేశారు. గుంటూరు రైల్వేస్టేషన్‌ను అత్యంత సుందరంగా అలంకరించారు. పండుగ వాతావరణంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు గుంటూరు డీఆర్ఎం రామకృష్ణ తెలిపారు. ఎన్ఎస్‌జీ-3 కేటిగిరీలో ఉన్న గుంటూరు రైల్వే స్టేషన్ అభివృద్ధికి రైల్వే శాఖ రూ.40.67 కోట్లు కేటాయించింది. మూడు లిఫ్టులు, ఒక ఎస్కలేటర్, 12 మీటర్ల వెడల్పుతో ఫుట్ బ్రిడ్జి, సర్క్యులేటింగ్ ఏరియా అభివృద్ధి, డిస్ప్లే సిస్టమ్స్, దివ్యాంగులకు సౌకర్యాల కల్పనతో అధునాతనంగా తీర్చిదిద్దారు.

పలు ఆర్‌యూబీల ప్రారంభోత్సవం

ప్రయాణికులు/రోడ్డువినియోగదారుల భద్రత దృష్ట్యా డివిజన్ పరిధిలోని పలు చోట్ల కాపలాదారు లేని లెవల్ క్రాసింగ్ గేట్లను రైల్వే శాఖ తొలగించి వాటి స్థానంలోఆర్‌యూబీలను రూ.38.28 కోట్లతో రైల్వే శాఖ నిర్మించింది. వినుకొండలో రూ. 5.01 కోట్లు, మునుమాక గేటు రూ. 2.49 కోట్లు, వేములూరిపాడు గేటు రూ. 5.01 కోట్లు, కొప్పురావూరులో రూ.5.90 కోట్లు, కంతేరు గేటు రూ.5.90 కోట్లు, దాచేపల్లి గేటు రూ. 2.49 కోట్లు, నార్కెట్‌పల్లి గేటు రూ.2.48 కోట్లు, బుదారం గేటు రూ.2.38 కోట్లు, కేసరాజుపల్లి గేటు రూ.2.47 కోట్లతో నిర్మాణం చేపట్టారు. వీటిని ప్రధాని మోదీ వీడియో లింకు ద్వారా ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించి రైల్వే అధికారులు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు.

నడికూడిలో శంకుస్థాపన

దాచేపల్లి: రైల్వే స్టేషన్లను ఆధునికీకరించి ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన అమృత్ భారత్ స్టేషన్‌లో భాగంగా నడికూడి జంక్షన్‌లో వర్చువల్ శంకుస్థాపనకు ఏర్పాట్లు చేశారు. నడికూడి 86వ రైల్వే గేటు వద్ద నిర్మించిన అండర్ పాస్ నిర్మాణం, స్టేషన్ ఆవరణలో చేయాల్సిన అభివృద్ధి పనులకు ప్రధాని మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. నడికూడి జంక్షన్‌లో 11.3 కోట్లతో అభివృద్ధి పనులు చేసేందుకు రైల్వేశాఖ నిధులు మంజూరు చేసింది. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

వేమూలూరిపాడు గేటు వద్ద నిర్మించిన ఆర్‌యూబీ


ప్రశాంతంగా గ్రూపు-2 పరీక్ష

- కేంద్రాలను సందర్శించిన అధికారులు


నరసరావుపేట : పరీక్షా కేంద్రాలను తనిఖీ చేస్తున్న జాయింట్ కలెక్టర్ శ్యాం ప్రసాద్

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 25: గ్రూపు-2 స్క్రీనింగ్ పరీక్ష జిల్లాలో ఆదివారం ప్రశాంత వాతావరణంలో కట్టుదిట్టమైన భద్రత మధ్యన జరిగింది. నరసరావుపేటలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాల, ఎస్ఎస్ఎన్ కళాశాలలో పరీక్షా కేంద్రాలను జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ తనిఖీ చేశారు. పరీక్ష నిర్వహణపై ఆయన సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాపీయింగ్ అవకాశం లేకుండా పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఏపీపీఎస్సీ నిబంధనల మేరకు నిర్ణీత సమయం వరకు మాత్రమే అభ్యర్థులను అనుమతించాలని ఆదేశించారు. పోలీసులు ప్రతీ ఒక్క కేంద్రం వద్ద బందోబస్తు ఏర్పాటు చేసి క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతనే లోనికి అనుమ తించారు. జిరాక్స్ సెంటర్లు, ఇంటర్నెట్ సెంటర్లను మూయించేశారు. కొంతమంది అభ్యర్థులు గ్రేస్ పీరి యడ్‌లో ఉరుకులు పరుగులు మీద పరీక్షా కేంద్రానికి వచ్చారు. పరీక్ష ముగిసిన వెంటనే సామగ్రి మొత్తాన్ని స్ట్రాంగ్‌రూంకు ప్రత్యేక పోలీసు బందోబస్తు మధ్య తరలించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్వో అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


గుంటూరు టీజేపీఎస్ కాలేజి వద్ద గ్రూపు -2 అభ్యర్థులు


పడమర బాపట్ల పంచాయతీ వైఎస్సార్ నగర్‌లో ఎంతోకాలంగా ధ్వంసమై ఉన్న సీసీరోడ్డు

పంచాయతీలకు పంగనామాలు

- పత్తా లేని 15వ ఆర్థిక సంఘం నిధులు
- కేంద్రం విడుదల.. రాష్ట్ర ప్రభుత్వం స్వాహా
- నిధులు లేక కునారిల్లుతున్న పంచాయతీలు
- అప్పుల ఊబిలో కూరుకుపోతున్న సర్పంచ్‌లు
- ఆదాయాలు తీసుకుని.. భారాలు పంచాయతీలపై
- నిధులు, విధులు లేని దయనీయ దుస్థితిలో సర్పంచ్‌లు

గ్రామసీమలు దేశానికి పట్టుకొమ్మలు.. అయితే వైసీపీ ప్రభుత్వ హయాంలో పంచాయతీలు నిస్తేజంగా మారా యి.. నిధులు, విధులు లేక నిర్వీర్యమై పోతున్నాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గ్రామాలాభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అనే చందంగా ఉంది. పంచాయతీల్లో నిధులు లేవు.. పాలకులకు విధులు లేవు.. పంచాయతీలు రాష్ట్ర ప్రభుత్వ తీరుతో నిస్తేజంగా మారు తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు ప్రత్యేకంగా నిధులు విడుదల చేయకపోగా కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే ఆర్థిక సంఘం నిధులను కూడా సొంతానికి వాడే సుకుంటోంది. ఇక సచివాలయ వ్యవస్థ పంచాయతీ పాలకులను ఉత్సవ విగ్రహాలుగా మారుస్తున్నాయి. నిధు లు, విధులు కోసం సర్పంచ్‌లు పోరు బాట సాగిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వానికి పట్టడంలేదు. చిన్నచిన్న పనులు చేయించాలన్నా కూడా నిధులు లేవని సర్పంచ్‌లు వాపో తున్నారు. పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ తదితర అత్యవసర పనులకు కూడా పంచాయతీ ఖాతాల్లో నిధు లు లేవు. గడచిన మూడేళ్ల పదవీ కాలం లో సర్పంచ్‌లుగా ఊరికి ఏమీ చేయలేక, చేయడానికి నిధులు లేక చేష్టలు డిగి చూస్తున్నారు. పంచాయతీల్లో నిధులు లేక అభివృద్ధి పనులు కుంటు పడుతున్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో పంచాయతీల పరిస్థితి పూర్తిగా దిగజారిపోయిందంటే ఆశ్చర్యం కాదు.

ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్, ఫిబ్రవరి 25: ఊరికి మేలు చేయాలన్న ఆశతో ఎన్నికల్లో సర్పంచులుగా గెలిచిన వాళ్ళు నిధులు, విధులు లేక ఉత్సవ విగ్రహాలుగా మారిపోయారు. గతంలో ఎన్నడూ లేని విధంగా స్థానిక స్వపరిపాలన సంస్థలు వైసీపీ ప్రభుత్వం హయాంలో పూర్తిగా నిర్వీర్యమైపోయాయి. జగన్ పుణ్యమా అని సర్పంచ్ కన్నా వార్డు వలంటీరుకే జనాదరణ మెండుగా ఉందంటే ఆశ్చర్యంకాదు. నిధుల లేమితో చేసేదిలేక ఎన్నుకున్న ప్రజలకు సమాధానం చెప్పలేక సర్పంచ్‌లు అల్లాడిపోతున్నారు. గ్రామ పంచాయతీలకు మూడేళ్ల క్రితం వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నికలు జరిగాయి. ఆ తర్వాత 15వ ఆర్థిక సంఘం నిధులను కేంద్రం సరైన సమయంలోనే రాష్ట్రానికి విడుదల చేసింది. పంచాయతీల ఖాతాల్లో జమ కావాల్సిన నిధులను కరెంటు బిల్లుల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం పక్కదారి పట్టించింది. ఆ నిధులు తిరిగి విడుదల చేస్తామని చెప్పినా ఇంతవరకు ఆచరణకు నోచుకోలేదు. ఇంటి పన్నులు ద్వారా వచ్చే ఆదాయం మాత్రమే కొన్ని పంచాయతీలకు ఆధారంగా ఉంది. నామమాత్రపు ఆదాయంతో గ్రామాల్లో మంచి, చెడ్డల నిర్వహణ మోయలేని భారంగా ఉంటోంది. ప్రజల కనీస అవసరాలు తీర్చేందుకు అప్పులు చేస్తున్నామని సర్పంచ్‌లు వాపోతున్నారు. పంచాయతీలు చెల్లించాల్సిన విద్యుత్ బిల్లులకు వడ్డీలు, చక్రవడ్డీలు వేసి రూ.కోట్లలో బకాయిలు చూపిస్తున్నారు. ఒకప్పుడు ఊరిలో ఏది జరిగినా సర్పంచులు మీద వేసుకుని ఖర్చు భరించేవారు ఇప్పుడు సర్పంచ్‌లు రోజురోజుకు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. పంచాయతీల్లో అవసరమైన స్టేషనరీ కూడా పంచాయతీ సర్పంచ్‌ల సొంత నిధుల నుంచి ఖర్చు పెట్టాల్సి వస్తుంది. వీధిలైట్లు బాగు చేయించడానికి కూడా నిధులు లేవని పలువురు సర్పంచులు వాపోతున్నారు. నిధులు లేకపోవడంతో గ్రామాల్లో పారిశుధ్యం పూర్తిగా అడుగంటిపోయింది. చెత్తఎత్తే వారికి జీతాలు ఇవ్వకపోవడంతో ఎక్కడ చెత్త అక్కడ పేరుకుపోతోంది. కాల్వలను శుభ్రం చేసేవారే లేకుండా పోయారు. పారిశుధ్యం క్షీణించి దోమలు వృద్ధి చెందుతున్నాయి. పలు గ్రామాల్లో మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తుంది. కాల్వలు అధ్వానంగా ఉన్నాయి. పంచాయతీల్లో బ్లీచింగ్, సున్నం చల్లిన దాఖలాలు లేవు. ఎవరైనా అధికారులు, వీఐపీలు వస్తున్న సందర్భంలో తప్పితే బ్లీచింగ్, సున్నం చల్లడం లేదు. పంచాయతీల్లో పారిశుధ్య పనుల నిర్వహణకు గతంలో గ్రీన్ అంబాసిడర్లను నియమించారు. వైసీపీ పాలనలో వారిని క్లాప్‌మిత్రలుగా మార్చారు. గత ప్రభుత్వ హయాంలో వీరికి స్వచ్ఛభారత్ కార్పొరేషన్ నిధుల ద్వారా వేతనాలు ఇచ్చేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ నిధులు కాస్త దారిమళ్లించి పంచాయతీ నిధులు నుంచే వేతనాలు ఇచ్చే ఏర్పాటు చేశారు. 15వ ఆర్థిక సంఘ నిధులు నేటి వరకు జమకాకపోవటంతో నెలలు కొద్ది వీరికి వేతనాలు చెల్లించలేకపోతున్నారు. కొంతమంది సర్పంచ్‌లు సొంత నిధులు వెచ్చిస్తున్నారు. ఇక తాగునీటి పథకాల మరమ్మతులు, నిర్వహణ అయితే చాలా పంచాయతీల్లో లేకుండా పోయింది. గ్రామాల్లో రక్షిత మంచి నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదు. ప్రజలకు రక్షిత మంచి నీటిని క్లోరినేషన్ చేసి అందించాల్సి ఉండగా దాని గురించి పట్టించుకునే వారే లేరు. గతంలో సర్పంచ్‌లు సొంత నిధులతో ఆయా పనులు చేసి ప్రభుత్వం నుంచి వచ్చిన తర్వాత తీసుకునే వారు. అయితే వైసీపీ ప్రభుత్వ హయాంలో గతంలో పెట్టిన ఖర్చులకు దిక్కు లేకుండా పోవడంతో పంచాయతీల్లో పనులను సర్పంచ్‌లు పట్టించుకోవడంలేదు. గ్రామాల్లో కొత్తగా రోడ్లు వేయకపోగా ఉన్న వాటికి మరమ్మతులు చేయలేకపోతున్నారు. మేజర్ గ్రామపంచాయతీల్లో కొంతమేర ఆదాయ వనరులు ఉండటం వల్ల అక్కడ కొంత మెరుగ్గా ఉంది. ఆదాయ వనరులు లేని మైనర్‌పంచాయతీల సర్పంచ్‌లు పడుతున్న ఇబ్బందులు చెప్పనలికాదు.


దుర్గిలో డంపింగ్ యార్డులా దర్శనమిస్తున్న వీధి

చైర్మన్ సరే.. నిధులు

ఇక పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం కూడా నిధులు విడుదల చేయాలి. ఐదో ఆర్థిక సంఘానికి చైర్మన్‌గా ప్రొఫెసర్ రత్నకుమారిని నియమించారు. కానీ ఇంతవరకు ఒక్క రూపాయి కూడా ఐదో ఆర్థిక సంఘం నిధులు పంచాయతీలకు విడుదల కాలేదు. దీనిపై సర్పంచులు నిరంతరం పోరాటం చేస్తున్నారు. సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి కూడా తీసుకెళ్లారు అయినా ప్రభు త్వం రూపాయి కూడా విదల్చలేదు.


బాపట్ల : ఇటీవల వర్షాలకు ధ్వంసమైన భర్తీపూడి రోడ్డు

ఎవరిపై కేసు పెట్టాలి

పంచాయతీల నిధుల్లో తేడాలు ఉంటే ఒకప్పుడు సర్పంచుల మీద రాష్ట్ర ప్రభుత్వం కేసులు పెట్టి వారి చెక్‌పవర్‌ను రద్దు చేసేది. అయితే ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వమే సర్పంచ్‌లకు, పంచాయతీ పాలకవర్గాలకు తెలియకుండా, వారి ఆమోదం లేకుండా నిధులను వాడేసుకుంటుంది. అంటే ఒకవిధంగా పంచాయతీ నిధులను రాష్ట్ర ప్రభుత్వం స్వాహా చేస్తున్నట్లే. అంటే ఇప్పుడు కేసులు ఎవరి మీద పెట్టాలని సర్పంచ్‌లు ప్రశ్నిస్తున్నారు. గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించకపోగా కేంద్రం ఇచ్చిన నిధులను పక్కదారి పట్టించింది. పంచాయతీల ఖాతాల్లో జమ కావాల్సిన నిధులను కరెంటు బిల్లుల పేరుతో వాడేసుకుంది. వాస్తవానికి పంచాయతీలు కరెంట్ బిల్లు చెల్లించాలన్నా దానికి పాలకవర్గ ఆమోదం ఉండాలి. ఆ తర్వాత మాత్రమే కరెంటు బిల్లును చెల్లించాలి. అయితే ఇవేవీ లేకుండానే పంచాయతీల నిధులను కరెంటు బిల్లు కింద జమ వేసుకున్నట్లు రాష్ట్ర స్థాయి అధికారులు చూపించారు.


రాజుపాలెంలో కాలువల్లో పెరిగిన పిచ్చి చెట్లు


అధ్వాన్నంగా వున్న గుత్తికొండ పరిధిలోని మురికికాలువ

గుదిబండలు ఎన్నో

రాష్ట్ర ప్రభుత్వం ఆదాయాన్ని తాను తీసుకుంటూ పంచాయతీలపై నిర్వహణ భారాన్ని నెట్టివేస్తోంది. పంచాయతీలలో ఏర్పాటు చేసిన గ్రీన్ అంబాసిడర్లకు ప్రభుత్వం జీతాలు చెల్లించాలి. మూడేళ్లుగా ప్రభుత్వం వారికి జీతాలు ఇవ్వడంలేదు. దీంతో పంచాయతీ నిధుల నుంచి వారికి జీతాలు చెల్లిస్తున్నారు. సచివాలయ వ్యవస్థ కూడా పంచాయతీలకు మోయలేని బరువుగా మారింది. సచివాలయాల్లో వివిధ సర్టిఫికెట్లు జారీ ద్వారా వచ్చిన నిధులను ప్రభుత్వం తన ఖాతాలో జమ వేసుకుంటుండగా, స్టేషనరీ బరువును మాత్రం పంచాయతీలపై నెడుతుంది. రోజురోజుకు కొండలా పెరిగిపోతున్న కరెంటు బిల్లులు పంచాయతీలకు గుదిబండలుగా మారాయి. పేరుగొప్ప ఊరుదిబ్బ అనుచందంగా రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటంగా సచివాలయాలను ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించింది. అయితే దానికి తగ్గ రీతిలో నిధులు సమకూర్చకపోవటం వల్ల అవి పంచాయతీలకు గుదిబండలుగా మారాయి.

నిధులు జమ చేయాలి



రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం పంపిన 15వ ఆర్థిక సంఘం నిధులను వెంటనే గ్రామపంచాయతీ అకౌంట్లో జమ చేయాలి. రాష్ట్ర ప్రభుత్వ ఐదో ఆర్థిక సంఘం నిధులను కూ డా పంచాయతీలకు ఇచ్చి ఆదుకోవాలి. లేని పక్షంలో పంచాయతీలు కునారిల్లి పోయే పరిస్థితి ఉంది. సచివాలయాల మీద వచ్చే ఆదాయాలను కూడా పంచాయతీలకు పంచాలి. సచివాలయాలను సర్పంచుల ఆధీనంలోనే పనిచేసే విధంగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలి.

- డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, ఏపీ పంచాయతీ పరిషత్ రాష్ట్ర చైర్మన్

నిర్వీర్యమైన గ్రామపాలన



గతంలో ఏ ప్రభుత్వాలలో లేని విధంగా వైసీపీ పాలనలో గ్రామపాలన నిర్వీర్యమైంది. అసలు సర్పంచ్‌ల అధికారాలు ఏమిటో కూడా తెలియని పరిస్థితి. కేంద్ర ప్రభుత్వ నిధులు కూడా పక్కదారి పట్టిస్తున్నారు. గ్రామాలలో క్షేత్రస్థాయిలో అభివృద్ధి లేదు. వచ్చే అరకొర నిధులు విద్యుత్ బకాయిలకు, చిన్న చిన్న పనులకే సరిపోతున్నాయి. గ్రామాభివృద్ధికి సరిపోయినంత నిధులు విడుదల చేయడం లేదు.

- పొందూరి నరసింహారావు, సర్పంచ్, కొత్తగణేశునిపాడు, పిడుగురాళ్ల

అప్పుల పాలయ్యాం



సర్పంచ్‌గా ఎన్నికైన నాటి నుంచి ఇప్పటి వరకు పంచాయతీకి నిధులు రాలేదు. మైనర్ పంచాయతీకావడంతో జనరల్‌ఫండ్స్ అంతంతమాత్రమే. గ్రామంలో సమస్యలు పరిష్కరించడానికి లక్షల రూపాయలు అప్పులు తెచ్చి పెట్టాం. దా తల సహకారంతో తాగునీటి ప్లాంట్ ఏర్పాటు చేసినా చెరువు, ఓవర్‌హెడ్‌ట్యాంక్ మరమ్మతులకు నిధులు లేవు. దీనివల్ల నిర్వహణ ఖర్చు భారంగా మారింది.

- బి.హనుమాన్‌జి, సర్పంచ్, గుడిపూడి, బాపట్ల మండలం

రాష్ట్ర ప్రభుత్వ తీరుతో ఆత్మహత్యలు



పంచాయతీల సర్పంచ్‌లను రాష్ట్ర ప్రభుత్వం ఉత్సవ విగ్ర హాలుగా మార్చింది. ఆర్థిక సంఘం ద్వారా కేంద్రం పంపిన రూ.629 కోట్లు రాష్ట్రం దారి మళ్లించి పంచాయతీల్లో అభివృద్ధిని అడ్డుకుంది. చేసిన పనులకు బిల్లులు మంజూరు చేయ కుండా సర్పంచ్‌ల ఆత్మహత్యలకు, అప్పులకు కారణమయ్యారు. గ్రామ స్వరాజ్యం కోసం రాజ్యాంగం కల్పించిన 29 హక్కులను పరిరక్షించాలి.

- పెదబాబు, జిల్లా సర్పంచ్‌ల సంఘం అర్గనైజింగ్ సెక్రటరి, సర్పంచ్, గుండాలపాడు, తాడికొండ.


మందడం రైతు ధర్నా శిబిరంలో బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేస్తున్న రైతులు

అనినీతి అనకొండలు రాష్ట్రాన్ని దోచేశాయి

● 1531వ రోజుకు రైతుల ఆందోళనలు

తుళ్లూరు, ఫిబ్రవరి 25: అనినీతి అనకొండలు ఆంధ్రప్రదేశ్‌ను దోచుకున్నాయని రాజధాని అమరావతికి 33వేల ఎకరాలు త్యాగంచేసిన రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు ఆదివారం నాటికి 1531వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి వారు మాట్లాడుతూ, మూడు ముక్కలాటతో రాష్ట్ర రాజధానిని నాశనం చేశారన్నారు. నాడు అమరావతికి ఎన్నో కంపెనీలు క్యూ కట్టేవన్నారు. దీంతో యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లక్షల్లో ఉండేవన్నారు. కాని సీఎం జగన్ రెడ్డి కావాలనే అమరావతిని మూడు రాజధానులని నాశనం చేశాడన్నారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం అమరావతి అభివృద్ధి కొనసాగుతున్నట్లు అయితే రాష్ట్ర సంపద రోజు రోజుకు పెరిగేదన్నారు. దానిని అడ్డుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేసి అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగించారు.రాజధాని 29 గ్రామాలతో పాటుగా మంగళగిరి తాడికొండ నియోజకవర్గాల్లో రైతుల ఆందోళనలు కొనసాగాయి.

జింకలను వేటాడుతున్న ముఠా అరెస్టు

బొల్లాపల్లి, నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 25: నల్లమల అటవీ ప్రాంతంలో పల్నాడు జిల్లా బొల్లాపల్లి మండలం పరిసర ప్రాంతాల్లో జింకలను వేటాడుతున్న ముఠాను ఆదివారం జిల్లా అటవీ శాఖ అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు జిల్లా అటవీశాఖ అధికారి రామచంద్రరావు తెలిపారు. ఆదివారం జిల్లా అటవీశాఖ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి రామచంద్రరావు మాట్లాడుతూ వన్యప్రాణులను వేటాడుతున్న ఆరుగురు సభ్యుల ముఠాను అటవీశాఖ సిబ్బంది గుర్తించి వారిని పట్టుకునే ప్రయత్నం చేసిందన్నారు. వారిలో నలుగురు దొరకగా ఇద్దరు పరారయ్యారని తెలిపారు. పట్టుబడిన వారినుంచి 20 జింక కొమ్ములు, ఒక జింక చర్మం స్వాధీనం చేసుకున్నట్లు రామచంద్రరావు తెలిపారు. విజయవాడకు చెందిన హెడ్ కానిస్టేబుల్ ఎస్‌కే రహ్మతుల్లా వీటిని కొనుగోలు చేసేందుకు రూ.40వేలకు బేరం కుదుర్చుకున్నట్టు తెలిపారు. రహ్మతుల్లా పరారీలో ఉన్నట్టుగా వివరించారు. వాటిని వేటగాళ్లు బెంగళూరు ఎక్స్‌పోర్టు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నల్లమల అటవీ ప్రాంతంలో వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. నిత్యం అటవీశాఖసిబ్బందితో వేటగాళ్ళపై ప్రత్యేకనిఘా ఉంటుందన్నారు.


అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్న జింక చర్మం, కొమ్ములు

వైసీపీ నుంచి టీడీపీలోకి 600 కుటుంబాలు

● కండువా కప్పి సాదరంగా ఆహ్వానించిన లోకేశ్

మంగళగిరి, ఫిబ్రవరి 25: యువగళం సారధి నారా లోకేశ్ పూరించిన శంఖారావం వైసీపీలో అలజడి రేపుతోంది. అధికార పార్టీని వీడి టీడీపీలో చేరేందుకు వైసీపీ నేతలు, కార్యకర్తలు క్యూకడుతున్నారు. వరుసగా టీడీపీలో చేరుతున్న వారితో మంగళగిరి నియోజకవర్గంలో వైసీపీ దాదాపు ఖాళీ అవుతోంది. తాజాగా ఉండవల్లిలోని నివాసంలో ఆదివారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సమక్షంలో 600 కుటుంబాలు టీడీపీలో చేరాయి. నియోజకవర్గానికి చెందిన వైసీపీ ముఖ్యనేతలు, పంచాయతీ సర్పంచులు, వార్డు సభ్యులు, వివిధ సంఘాల పెద్దలు తెలుగుదేశం పార్టీలో చేరారు. రాష్ట్రంలో వైసీపీ సర్కారు అరాచకాలకు కాలం చెల్లిందని, రాబోయే సార్వత్రిక ఎన్నికల తరువాత టీడీపీ-జనసేన ప్రభుత్వం ఏర్పడుతుందని, రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఈ సందర్భంగా లోకేశ్ భరోసా ఇచ్చారు. మంగళగిరిని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు అందరం కలిసికట్టుగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. మంగళగిరి పట్టణం 22వ వార్డుకు చెందిన వైసీపీ నేత, సగర సంఘం రాష్ట్ర కార్యదర్శి జ్యూటు ఏడుకొండలు నేతృత్వంలో 21, 22 వార్డులకు చెందిన, బేతపూడి గ్రామానికి చెందిన 75 కుటుంబాలు, జొన్నకూటి మల్లేశ్వరీ ఆధ్వర్యంలో 25 కుటుంబాలు తెలుగుదేశంలో చేరాయి. తాడేపల్లి పట్టణానికి చెందిన వైసీపీ నేతలు దారా నాని, ఎనుబరి నరేష్‌తోపాటు 14వ వార్డుకు చెందిన 50 కుటుంబాలు, వైసీపీ నేత మేకా శ్రీధర్‌రెడ్డి, ఉండవల్లి మాజీ సర్పంచ్ మన్నెం సుజాత, కిషోర్ దంపతులతోపాటు వంద కుటుంబాలు పసుపు కండువా కప్పుకున్నాయి. మంగళగిరి మండలం నీరుకొండ గ్రామానికి చెందిన వైసీపీ నేత తాడిబోయిన వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో 15 కుటుంబాలు, ఆత్మకూరు గ్రామానికి చెందిన బుడగ జంగాల కులపెద్దలు ఒంటెద్దు రామచంద్రయ్య, ఆంజనేయులు సమక్షంలో 70 కుటుంబాలు, ఎర్రబాలెం గ్రామానికి చెందిన అభయాంజనేయస్వామి ఆలయ కమిటీ ఛైర్మన్, వైసీపీ ముఖ్యనేత పలగాని శివప్రసాద్ టీడీపీ గూటికి చేరారు. దుగ్గిరాల మండలం చింతలపూడి వైసీపీకి చెందిన 2వ వార్డు నర్రా శ్రీనివాసరావు, 7వ వార్డు యాదల సాయిలక్ష్మీతోపాటు మొత్తంగా 600 కుటుంబాలను నారా లోకేశ్ టీడీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య, గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, నియోజకవర్గ పరిశీలకుడు ముమ్మిడి సత్యనారాయణ, మంగళగిరి మండల అధ్యక్షుడు తోట పార్థసారధి, తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు, మండల అధ్యక్షుడు అమరా సుబ్బారావు, దుగ్గిరాల మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, మంగళగిరి పట్టణ అధ్యక్షుడు దామర్ల రాజు, ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, విన్నకోట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


ఉండవల్లి మాజీ సర్పంచ్ మన్నెం సుజాత, కిషోర్ దంపతులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న నారా లోకేశ్


మంగళగిరి 19వ వార్డుకు చెందిన చింకా బాలసూర్యప్రకాష్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న నారా లోకేశ్

చంద్రబాబుతో భేటీ సంతృప్తికరం

● సోషల్ మీడియాలో వస్తున్న ఏ పుకార్లను నమ్మవద్దు
● నా కోసం వెన్నంటి నడిచిన నా కార్యకర్తలకు రుణపడి ఉంటా
● త్వరలో అందరినీ కలిసి సంతోషకర విషయాలను పంచుకుంటా
● మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర భవిష్యత్తుకోసం తెలుగుదేశం, జనసేన పార్టీల కలయిక అనేక శుభపరిణామమైతే ఈ పొత్తుల వల్ల తెనాలి సీటు ఇవ్వలేకపోవడంపై నా పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వివరించిన తీరు, నాకు న్యాయం జరిగేలా చూస్తానని ఇచ్చిన మాట చాలా సంతృప్తినిచ్చాయని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో టీడీపీ పెద్దల్లో కొందరికి సీటు కేటాయించలేని పరిస్థితుల్లో స్వయంగా చంద్రబాబే వారిని పిలిచి పరిస్థితిని వివరించి పంపించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే తెనాలి మాజీ ఎమ్మెల్యే ఆలపాటిని కూడా పిలిపించారు. ఆదివారం ఆయన పార్టీ అధినేత చంద్రబాబును కలిసి వచ్చిన తరువాత ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. చంద్రబాబుతో జరిగిన భేటీ చాలా సంతృప్తినిచ్చిందని తనకు సీటు ఎందుకు ఇవ్వలేకపోయానన్న విషయాలను ఆయన స్పష్టంగా వివరించారని ఇప్పుడున్న పరిస్థితుల్లో తానుకూడా వదులుకోవల్సిన అవసరం ఉందన్న అభిప్రాయానికి వచ్చానన్నారు. సీటు దక్కని సీనియర్లు ఎవ్వరికీ ఎటువంటి అన్యాయం జరగదని ఆయన మాట ఇచ్చారని మిగిలిన కీలక బాధ్యతలను కూడా చేపట్టాల్సి రావడం తనకు చాలా సంతోషానిచ్చిందన్నారు. అయితే తనకు తెనాలి సీటు దక్కకపోవడంపై కార్యకర్తలు, అభిమానులు మిగిలిన పార్టీ శ్రేణులు నిరుత్సాహానికి గురయ్యారని తెలిపారు. పలు సందర్భాల్లో ఆందోళన వ్యక్తం చేస్తూ నాదగ్గర ప్రస్తావిస్తే వారిని వారిస్తూ వచ్చానని, కొన్ని సందర్భాల్లో గెలుపు ఓటములే కాకుండా పోటీ చేసే విషయాల్లోనూ త్యాగాలు చేయాల్సి వస్తుందని అన్నారు. దీనిపై ఎవ్వరూ అసంతృప్తి చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. అయితే త్వరలో కార్యకర్తలు అభిమానులందరినీ కలిసి వారితో మాట్లాడతానన్నారు. తనకు సీటు కేటాయింపుల విషయంలో గానీ మరికొన్ని కారణాలు చూపుతూ సోషల్ మీడియాలో అనేక అవాస్తవాలు ప్రచారమవుతున్నాయని వాటిని ఎవ్వరూ పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం లేదన్నారు. ఇటువంటి పుకార్లు గతంలో చాలాసార్లు వచ్చాయని వాటిని నేను అసలు పట్టించుకోనని కార్యకర్తలు కూడా లెక్కచేయాల్సిన అవసరం లేదన్నారు. పార్టీ తీసుకున్న నిర్ణయానికి అందరం కట్టుబడి ఉండాల్సిందేనని, రేపటి ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేసి టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తానని స్పష్టం చేశారు.

వీఐటీలో ముగిసిన క్రీడా సాంస్కృతిక ఉత్సవం



వీఐటీలో విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న జ్యోతి సురేఖ, యాజమాన్యం తదితరులు

తుళ్లూరు, ఫిబ్రవరి 25: వీఐటీ - ఏపీ విశ్వవిద్యాలయంలో విటోపియా 2024 వార్షిక క్రీడలు సాంస్కృతిక ఉత్సవం ఆదివారంతో ఘనంగా ముగిశాయి. రెండు రోజుల పాటు ఈ క్రార్యక్రమం జరిగింది. ముగింపుకు ముఖ్యఅతిథిగా అర్జున అవార్డు గ్రహీత వెన్నం జ్యోతిసురేఖ హాజరయ్యారు. వివిధ క్రీడా పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థులు అందరూ ఒక లక్ష్యాన్ని పెట్టుకొని సాధనకు కృషి చేయాలన్నారు. వీఐటీ వైస్ చాన్సలర్ ఎస్వీవి కోటారెడ్డి మాట్లాడుతూ విద్యతో పాటు కీడ్రలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రోత్సహించేందుకు విశ్వవిద్యాలయం అందిస్తున్న సహకారాన్ని తెలిపారు. అంతే కాకుండా పరిశోధన రంగాలలో వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయం ప్రగతి గురించి తెలిజేశారు. సమయ్ రైనా స్టాండప్ కామెడీ అందరిని అలరించింది. సాయంత్రం జరిగిన ప్రొ-షోలో జోనిత గాంధీ బ్యాండ్, సలీమ్ అండ్ సులేమాన్ బ్యాండ్, డిజే ప్రోగ్రెసివ్ బ్రదర్స్ బ్యాండ్‌ల సంగీత విభావరి అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో వీఐటీ రిజిస్ట్రార్ జగదీష్ ముదిగంటి డాక్టర్ సుధాకర్ ఇలంగో, విటోపియా స్టూడెంట్ వెల్ఫేర్ డీడీ డాక్టర్ ఖాదర్ పాషా, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అత్యాధునిక వైద్యసేవలకు నిలయం.. శ్రేష్ఠ హాస్పిటల్స్

● ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ లక్ష్మణస్వామి వెల్లడి

గుంటూరు (మెడికల్), ఫిబ్రవరి 25: అన్ని రకాల వైద్యసేవలను ఒకే చోట లభించేలా అత్యాధునిక రీతిలో నిర్మించిన శ్రేష్ఠ హాస్పిటల్స్‌ను కోస్తావాసుల కోసం అందుబాట్లోకి తెచ్చినట్లు ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్, శ్రేష్ఠ హాస్పిటల్స్ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ వై.లక్ష్మణస్వామి తెలిపారు. గుంటూరు జేకేసీ కళాశాల రోడ్‌లో డీమార్ట్ ఎదురుగా నూతనంగా ఏర్పాటుచేసిన శ్రేష్ఠ హాస్పిటల్స్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. తమ హాస్పిటల్స్‌లో న్యూరాలజీ, కార్డియాలజీ, జనరల్ మెడిసిన్, పల్మనాలజీ, ఆర్థోపెడిక్, కార్డియో థొరాసిక్ సర్జరీ, యూరాలజీ, ఈఎన్‌టీ, జనరల్ సర్జరీ, క్రిటికల్ కేర్ మెడిసిన్ విభాగాలు ఉన్నట్లు తెలిపారు. ఇకపై వైద్యం కోసం రోగులు సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా శ్రేష్ఠ హాస్పిటల్స్‌లో పొందవచ్చని డాక్టర్ లక్ష్మణస్వామి తెలిపారు. కార్డియాలజిస్ట్ డాక్టర్ గొట్టిపాటి నాగార్జున మాట్లాడుతూ శ్రేష్ఠ హాస్పిటల్స్‌లో గుండె సంబంధిత ఆధునిక వైద్య చికిత్సలు అందుబాట్లో ఉన్నట్లు తెలిపారు. రాష్ట్రంలోనే ప్రప్రథమంగా జీఈ క్యాథ్‌ల్యాబ్ ఆటోరైట్ మెషిన్ అందుబాట్లో ఉన్నట్లు వివరించారు. రేడియాలజిస్ట్ డాక్టర్ సుస్మిత మాట్లాడుతూ తన దగ్గర 1.5 టెస్లా ఎంఆర్ఐ స్కానింగ్, హెచ్‌ఆర్‌సీటీ వంటి అన్ని రకాల ఆధునిక రేడియాలజీ స్కానింగ్ మెషిన్‌లు అందుబాట్లో ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నగరానికి చెందిన పలువురు వైద్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ వై.లక్ష్మణస్వామి

ఫ్లెక్సీలను చించివేయడం పిరికిపంద చర్య

● బాబు, లోకేశ్ ఫ్లెక్సీలు చించిన వారిపై చర్యలు తీసుకోవాలి

తాడేపల్లి టౌన్, ఫిబ్రవరి 25: ఉండవల్లి కరకట్ట మార్గంలో ఇరువైపులా ఉన్న టీడీపీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడు, ప్రధానకార్యదర్శి నారా లోకేశ్, టీడీపీ ఫ్లెక్సీలు చించివేసిన వైసీపీ ఎంపీ నందిగం సురేష్‌కు చెందిన అనుచరులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ టీడీపీ పట్టణ నేతలు వల్లభనేని వెంకట్రావు సారథ్యంలో తాడేపల్లి పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. ఫ్లెక్సీలను చించివేయడం పిరికపంద చర్యని అన్నారు. ఈ ఘటన వీడియో కూడా వైరల్ అయిందని, సదరు వ్యక్తులను పోలీసులు వెంటనే అదుపులోకి తీసుకోవాలని నేతలు ఫిర్యాదు చేశారు. వైసీపీ నేతలు, కార్యకర్తలు పలువురు వీధి రౌడీల్లా వ్యవహరిస్తున్నారని రాబోయే ఎన్నికల్లో వైసీపీకి తగిన బుద్ధి చెబుతామని నేతలు వ్యాఖ్యానించారు. ఫిర్యాదు చేసిన వారిలో పట్టణ టీడీపీ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు, మహిళా అధ్యక్షురాలు అన్నెం కుసుమ, టీడీపీ నేతలు దారా దాసు, కేళి వెంకటేశ్వరరావు, ఇట్టా భాస్కర్, ఇట్టా పెంచలయ్య, ఓలేటి రాము, మేకా పుల్లారెడ్డి, అద్దంకి మురళి, జుంజు మరియదాసు, బెజ్జం రామకృష్ణ, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కొయ్యగూర మహాలక్ష్మి, బూదాల రవికుమార్, చాన్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.


తాడేపల్లి పోలీస్ స్టేషన్ ఎదుట నినాదాలు చేస్తున్న టీడీపీ నేతలు

మురుగుకాల్వలో మృతదేహం లభ్యం

పొన్నూరుటౌన్, ఫిబ్రవరి 25: మండలంలోని వెల్లలూరు గ్రామంలో మురుగు కాల్వలో యువకుడి మృతదేహాన్ని ఆదివారం రూరల్ పోలీసులు కనుగొన్నారు. ఎస్ఐ బి.భార్గవ్ కథనం ప్రకారం వెల్లలూరు గ్రామంలో రోడ్డు ప్రక్కన ఉన్న మురుగు కాల్వలో సుమారు 30 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగిన యువకుడి మృతదేహం పడి ఉంది. మృతదేహంపై పొడవు చేతుల చొక్క, నిక్కరు ఉంది. ఆచూకి కోసం వివరాలు సేకరిస్తున్నారు. ప్రమాదవశాత్తు చనిపొయ్యాడా లేక మరోకోణం ఏమైనా ఉందా అనే అంశాలను దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.


మురుగుకాల్వలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై భార్గవ్

ఈ అమ్మ పేరేదో.. ఊరేదో?

బాపట్ల, ఫిబ్రవరి 25: కనిపెంచిన బిడ్డలకు తల్లి భారమైందా లేక బిడ్డలను వదిలి వచ్చేసిందా అనేది తెలియదుకాని తొమ్మిది పదుల వయసులో ఓ వృద్ధురాలు వీధినపడింది. బాపట్ల పట్టణంలోని సీపీఐ కార్యాలయం వద్దకు గత రెండు రోజులు క్రితం వచ్చిన వృద్ధురాలు అక్కడే ఉండిపోయింది. పట్టణంలోని శృంగారపురం, సీబీజెడ్‌చర్చి వెనుక సీపీఐ కార్యాలయం వద్ద ఉన్న వృద్ధురాలిని సీపీఐ జిల్లా నాయకులు జేబీ శ్రీధర్ అక్కున చేర్చుకొని ఆదరించారు. కార్యాలయంలోనే ఉంచి ఆమెకు కావాల్సిన ఆహారం అందిస్తున్నాడు. ఆ వృద్ధురాలు ఏమి చెప్పలేకపోతోంది. ఈ విషయమై 100కు డయిల్ చేసిన పోలీసులు స్పందించలేదని, పట్టణ పోలీసులకు చెప్పిన పట్టించుకోలేదని శ్రీధర్ తెలిపారు. ఈ విషయాన్ని ఐసీడీఎస్ సీడీపీవో బిశైలజ దృష్టికి తీసుకెళ్ళగా వృద్ధురాలికి ఆశ్రమం కల్పిస్తానని చెప్పినట్లు శ్రీధర్ తెలిపారు.


బాపట్ల సీపీఐ కార్యాలయం గేటు వద్ద ఉన్న వృద్ధురాలు

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 25: పట్టణంలోని అరండల్‌పేటకు చెందిన షేక్ మౌలాలి(39) శనివారం రాత్రి అనుమానాస్పదంగా మృతి చెందినట్టు ఫిర్యాదు అందిందని మొదటి పట్టణ పోలీసులు తెలిపారు. మృతుడు మౌలాలికి అతని మేనల్లుడితో కొన్నాళ్లగా కుటుంబకలహాలు ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి మౌలాలి అనుమానాస్పదంగా అతని ఇంట్లోనే మృతిచెందినట్టు మృతుడి సోదరుడు షేక్ మస్తాన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతునికి భార్య, ఇరువురు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.


మౌలాలి మృతదేహం

అదుపు తప్పి కళాశాల బస్సు బోల్తా

వేమూరు, ఫిబ్రవరి 25: ఎదురుగా వెళుతున్న గడ్డి ట్రాక్టర్‌ను దాటి వెళ్ళేందుకు ప్రయత్నించిన ఓ ప్రైవేట్ కళాశాల బస్సు బోల్తా పడింది. వేమూరు ఆయిల్ బంక్ సమీపంలో ఆదివారం సాయంత్రం ఈ ఘటన చోటు చేసుకుంది. తెనాలికి చెందిన ప్రైవేట్ కళాశాల విద్యార్థులు కొల్లూరులోని తమ బ్రాంచ్ కళాశాలలో క్రీడల పోటీల్లో పాల్గొనేందుకు కళాశాల బస్సులో వెళ్ళారు. సాయంత్రం తిరిగి వస్తుండగా ఎదురుగా వెళ్తున్న గడ్డి ట్రాక్టర్‌ను తప్పించేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో బస్సు అదుపు తప్పి రోడ్డుపై బోల్తా పడింది. 21మంది విద్యార్థులు, నలుగురు టీచర్స్ బస్సులో ఉన్నారు. వారిలో ముగ్గురు విద్యార్థులకు ఒక టీచర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వారికి సమీపంలోని ప్రభుత్వ వైద్యశాలలో ప్రథమ చికిత్స చేసి సురక్షితంగా తెనాలికి పంపారు. వేమూరు ఎస్ఐ రాజశేఖర్ ప్రమాదస్థలిని సందర్శించి దర్యాప్తు చేస్తున్నారు.


వేమూరు ఆయిల్ బంక్ సమీపంలో బోల్తాపడ్డ కళాశాల బస్సు

జగన్ పాలనలో దళితులపై దమనకాండ

● తాడేపల్లిలో దళిత శంఖారావం

తాడేపల్లి టౌన్, ఫిబ్రవరి 25: అయిదేళ్ల జగన్ పాలనలో దళిత జాతికి తీవ్రనష్టం జరిగిందని, రాష్ట్రంలో దళితులకు కనీస రక్షణ లేకుండా పోయిందని టీడీపీ దళిత నేతలు మండిపడ్డారు. దళితులపై దమనకాండకు నిరసనగా తాడేపల్లి పట్టణంలోని శుభమస్తు కల్యాణ మండపంలో ఆదివారం రాత్రి దళిత శంఖారావం నిర్వహించారు. టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్మెస్ రాజు, టీడీపీ గుంటూరు పార్లమెంటు అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్, రాష్ట్ర అధికార ప్రతినిధి మహాసేన రాజేష్, క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామిదాస్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. తొలుత స్వర్గీయ ఎన్టీఆర్, బాబా సాహెబ్ అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటాలకు నివాళులు అర్పించారు. ఎమ్మెస్ రాజు మాట్లాడుతూ వైసీపీ అరాచకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి జగన్ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు అన్ని జిల్లాల్లో దళిత శంఖారావం సభలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. చరిత్రలో ఏ ముఖ్యమంత్రీ దళితులకు చేయని నష్టాన్ని జగన్‌రెడ్డి చేశారన్నారు. స్వామిదాస్ మాట్లాడుతూ క్రైస్తవులను మరోమారు మోసం చేసేందుకు సీఎం జగన్ తెరతీశారని పేర్కొన్నారు. రాష్ట్రంలో సుమారు 75 వేల మంది క్రైస్తవులు, పాస్టర్లు వుంటే కేవలం పది శాతం మందికి మాత్రమే గౌరవ వేతనాలు ఇస్తూ నిలువునా మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. గత టీడీపీ హయాంలో 277 ప్రార్థనా మందిరాలు నిర్మించగా, వైసీపీ ప్రభుత్వంలో కనీసం ఒక్కటైనా నిర్మించారా అని ప్రశ్నించారు. శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ దళిత నియోజకవర్గాల మధ్య ఏర్పాటు చేసిన ప్రజా రాజధాని అమరావతిని నిర్వీర్యం చేసి దళితుల అభివృద్ధిని అడ్డుకున్నారని మండిపడ్డారు. మహాసేన రాజేష్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో దళితులపై దాడులు, దౌర్జన్యాలు, హత్యలు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత అయిదేళ్లలో 12 వేల ఎకరాల ఎసైన్డు భూములను వైసీపీ ప్రభుత్వం లాక్కుని పేద దళిత కుటుంబాలను రోడ్డున పడవేసిందన్నారు. దళితులపై జగన్ ప్రభుత్వం సాగిస్తున్న అకృత్యాలను నిరోధించాలంటే రాబోయే ఎన్నికల్లో దళితులంతా టీడీపీ అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి బేతపూడి విజయ్‌శేఖర్, టీడీపీ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు కనికళ్ల చిరంజీవి, క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు యర్రగుంట్ల భాగ్యారావు, ఎస్సీ సెల్ గుంటూరు పార్లమెంటు అధ్యక్షుడు వేమూరి మైనర్‌బాబు, నియోజకవర్గంలోని దళిత నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మహాసేన రాజేష్

రాష్ట్రంలో అరాచకపాలను తరిమికొడదాం

● జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్

తెనాలి రూరల్, ఫిబ్రవరి 25: రాష్ట్రంలో వైసీపీ అరాచకపాలనను తరిమికొడదామని అభివృద్ధి, సంక్షేమానికి బాటలు వేసే టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకుందామని జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు. తెనాలిలో టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా నాదెండ్ల మనోహర్‌కు సీటు డిక్లేర్ అయిన తరువాత తొలిసారిగా పార్టీ కార్యాలయానికి విచ్చేసిన మనోహర్‌కు ఇరుపార్టీల శ్రేణులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయనను కలుసుకుని సత్కరించి పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేద్దామన్నారు. రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ కల్పిస్తూ ప్రవేశపెట్టిన భవిష్యత్తుకు గ్యారెంటీ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా అందుకు తగ్గట్టుగా సిద్ధంగా ఉండాలని పార్టీ శ్రేణులకు నాదెండ్ల పిలుపునిచ్చారు. పలువురు టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.90 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	155, 164,175
చికెన్ విత్ స్కిన్	300.00
చికెన్ స్కిన్ లెస్	310.00


పార్టీలో చేరిన వారితో బ్రహ్మారెడ్డి

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

కారంపూడి, ఫిబ్రవరి 25 : మండలంలోని రెడ్డిపాలేనికి చెందిన 20 వైసీపీ ఎస్సీ కుటుంబాలు ఆదివారం ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. మాచర్లలోని టీడీపీ కార్యాలయంలో వారు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఉన్నం లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీపీ గంగారావు, బొల్నేడి శ్రీను, పంగులూరి అంజయ్య, చప్పిడి రాము, కోదాడి ప్రభాకర్, లింగాల శ్రీను, కొమ్ము కోటయ్య, శ్రీను, రాంబాబు, రవి, ప్రకాష్, రమేష్, సోమయ్య, బుజ్జిబాబు, అశోక్, సుంకర యేసురత్నం తదితరులు పాల్గొన్నారు.

కాణిపాకం వరసిద్ధి వినాయక అన్నదాన ట్రస్టు అధ్యక్షుడిగా రామ్మోహన్‌రావు


రామ్మోహన్‌రావు

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 25 : చిత్తూరు జిల్లా కాణిపాకం స్వయంభు వరసిద్ధి వినాయక స్వామి క్షేత్ర ఆర్యవైశ్య వాసవి నిత్యాన్నదాన సత్రం ట్రస్టు అధ్యక్షుడిగా పిడుగురాళ్లకు చెందిన పచ్చిపులుసు రామ్మోహన్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం దేవాలయంలో జరిగిన సమావేశంలో అధ్యక్షుడిగా పచ్చిపులుసు రామ్మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శిగా వినుకొండకు చెందిన అచ్యుత రామసుబ్బారావు, కోశాధికారిగా హైదరాబాద్‌కు చెందిన కామిశెట్టి రాజేంద్రప్రసాద్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌రావు మాట్లాడుతూ నిత్యాన్నదాన ట్రస్టు ద్వారా అన్నదాన, సేవా కార్యక్రమాలను విస్తృతపరుస్తామని తెలిపారు.

ప్రైవేటు పాఠశాలలో ఉచిత విద్యకు దరఖాస్తులు

కారంపూడి, ఫిబ్రవరి 25 : మండల పరిధిలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్యకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవోలు కాంతారావు, రవికుమార్ తెలిపారు. మార్చి 14వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆధార్, కులం, ఆదాయం, రేషన్ కార్డులతోపాటు పాస్‌పోర్టు సైజు ఫోటోతో సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. మరిన్ని వివరాలకు మండల విద్యాశాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

సాగరమాత ఆలయంలో పతాకావిష్కరణ


ప్రత్యేక ప్రార్థనలో ఫాదర్ బాలస్వామి

విజయపురిసౌత్, ఫిబ్రవరి 25 : సాగర మాత మహోత్సవాలను పురస్కరించుకొని స్థానిక సాగరమాత ఆలయంలో ఆదివారం ఫిరంగిపురం ఫాదర్ పామిశెట్టి బాలస్వామి ప్రత్యేక ప్రార్థనలతో సాగరమాత పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో తేరు ప్రదిక్షణ గావించారు. ఫాదర్ బాలస్వామి మాట్లాడుతూ మార్చి 7వ తేదీ నుంచి మూడు రోజులపాటు సాగరమాత మహోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కాగా సోమవారం నుంచి మార్చి 6వ తేదీ వరకు నవదిన జపములు, దివ్యబలిపూజ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ విచారణ గురువులు జోసఫ్ బాలసాగర్, ఫాదర్ అన్నెం జోసఫ్ తంబి, దుర్గెంపూడి ఇన్నారెడ్డి, జక్కిరెడ్డి చిన్నపరెడ్డి, శౌరిరాజు, ఆలేటి మరియదాసు, శౌరిబాబు, కట్టారాజు చందు తదితరులు పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 25 : పిడుగురాళ్ల బైపాస్ ప్రారంభంతో పాటు పట్టణంలో పలువురి నేతల విగ్రహాలను సోమవారం ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి తెలిపారు. కామేపల్లి మెడికల్ కళాశాల వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే కాసు మాట్లాడుతూ బ్రాహ్మణపల్లి సమీపంలో నిర్మిస్తున్న మెడికల్ కళాశాలలోని మొదటి ఫేజ్ కింద 100 పడకల ఆసుపత్రి భవనాన్ని సోమవారం ప్రారంభోత్సవం చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా మున్సిపల్ కార్యాలయ భవనాన్ని కూడా ప్రారంభిస్తున్నట్లు కాసు తెలిపారు. నరసరావుపేట పార్లమెంట్ వైసీపీ అభ్యర్థి అనిల్ కుమార్ యాదవ్‌తో కలిసి పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, మాజీ ఎంఎల్‌సీ టీజీవీ కృష్ణారెడ్డి, గఫూర్, ముడేల వెంకటేశ్వరరెడ్డి, అల్లు పిచ్చిరెడ్డి, కొమ్ము ముక్కంటి, పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెంటచింతలలో రూ.10 కోట్లతో అభివృద్ధి పనులు పూర్తి చేశా

● ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ పీఆర్కే


ఆంజనేయస్వామి మాణ్యంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే పీఆర్కే

రెంటచింతల, ఫిబ్రవరి 25 : మేజర్ పంచాయతీ రెంటచింతలలో ఇప్పటి వరకు రూ.10 కోట్లతో వివిధ రకాల అభివృద్ధి పనులు పూర్తి చేసినట్లు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు. రెంటచింతలలోని ఆంజనేయస్వామి మాణ్యంలో ఆదివారం ఆయన పర్యటించారు. ఇటీవల మృతి చెందిన అన్నపరెడ్డి వెంకటస్వామిరెడ్డి కుటుంబీకులను పరామర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడ లేని విధంగా జడ్పీ గెస్ట్ హౌస్‌ను రూ.20 లక్షలతో మండల పరిషత్ కార్యాలయంలో నిర్మించామన్నారు. అలాగే ముస్లింలకు రూ.40 లక్షల మైనింగ్ ఫండ్‌తో షాదిఖానా నిర్మించామని త్వరలో ప్రారంభోత్సవం చేస్తానన్నారు. మార్చి 5 కల్లా శివరాత్రి పనులన్నీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని సర్పంచ్‌లను కోరారు. ఈ సమావేశంలో జడ్పీ వైస్ చైర్మన్ ఎస్.నర్సిరెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ గొట్టం బ్రహ్మారెడ్డి, మండల పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు పి.సంపూర్ణమ్మ, శౌర్రెడ్డి, మాజీ ఎంపీపీ దాసరి చౌడేశ్వరీ, సర్పంచ్ పేర్ల చౌడమ్మ, జిల్లా జేసీఎస్ కన్వీనర్ మోర్తల ఉమ, మర్రెడ్డి, ఇన్నారెడ్డి, కట్టమూరి శ్రీనివాసరావు, గుండా కిషోర్, గొట్టం భాస్కరరెడ్డి, పమ్మి సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

బెల్లంఊట ధ్వంసం


బెల్లంఊటను ధ్వంసం చేస్తున్న అధికారులు

వెల్దుర్తి, ఫిబ్రవరి 25 : మండలంలోని కొత్తపుల్లారెడ్డిగూడెంలో ఆదివారం మాచర్ల సెబ్ అధికారులు దాడులు నిర్వహించారు. నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన 800 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. కాగా తమ రాకను గమనించిన సారా తయారీదారులు అక్కడి నుంచి పారిపోయారని అధికారులు తెలిపారు.

పల్స్‌పోలియోకు సిద్ధం కావాలి : డాక్టర్ కృష్ణారెడ్డి

రెంటచింతల, ఫిబ్రవరి 25 : పీహెచ్‌సీ పరిధిలో గల వైద్య సిబ్బంది మార్చి 3న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమానికి సిద్ధం కావాలని పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.కృష్ణారెడ్డి కోరారు. ఆదివారం పీహెచ్‌సీ పరిధిలో గల వైద్య సిబ్బంది, అంగన్వాడీ, ఆశా వర్కర్లుతో సమావేశాన్ని నిర్వహించారు.

సైకో ముఖ్యమంత్రిని సాగనంపాలి

● టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ


భీమవరంలో టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేస్తున్న కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, ఫిబ్రవరి 25 : రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న సైకో ముఖ్యమంత్రిని ప్రజలంతా సాగనంపాలని టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని భీమవరంలో ఆదివారం రాత్రి ఎన్నికల ప్రచారాన్ని ఆయన నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి ఇంటింటికి తిరిగి టీడీపీ మేనిఫెస్టోలోని పథకాలను ప్రజలకు వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. వైసీపీ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య జరిగే ఎన్నికల్లో సైకో ముఖ్యమంత్రిని రాష్ట్రం నుంచి తరిమివేయాలన్నారు. గ్రామంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కన్నాకు పూలు చల్లుతూ ఘనంగా స్వాగతం పలికారు. గ్రామంలో దివంగత మాజీ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు విగ్రహానికి కన్నా పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఆళ్ళ అమరేశ్వరరావు, ఆళ్ళ సాంబయ్య, భీమినేని వందనాదేవి, కొండవీటి దత్తాత్రేయులు, తొరటి వెంకటరావు, బలుసుపాటి వెంకట సుబ్బయ్య, మేకల రమేష్, ఒంటిపులి అంకమ్మ, ఒంటిపులి మల్లేశ్వరి, కంతేటి అప్పమ్మ, మాకినేని విజయ్, దామచర్ల శ్రీనివాసరావు, చిన్నరాజు, నోముల ప్రకాష్, కంభాల వెంకటేశ్వర్లు, దివ్వెల శ్రీనివాసరావు, గ్రామం, మండలానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే నవ్యాంధ్ర అభివృద్ధి సాధ్యం : కన్నా

సత్తెనపల్లి, ఫిబ్రవరి 25 : నవ్యాంధ్ర అభివృద్ధి టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని సత్తెనపల్లి టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సత్తెనపల్లి నియోజకవర్గ అభివృద్ధికి తాను హామీ ఇస్తున్నానని తెలిపారు. తిరిగి రాష్ట్రంలో పూర్వ వైభవం, ప్రగతి సాధించేందుకు ప్రజలంతా ఐక్యంగా ఉండి జనసేన, టీడీపీ ఉమ్మడి ప్రభుత్వాన్ని గెలిపించాలన్నారు. టీడీపీ, జనసేన భాగస్వామ్యంలో రానున్న ఎన్నికల్లో అఖండ విజయం సాధించి రాష్ట్రాన్ని కాపాడుకుందామన్నారు.

స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో సరుకుల మాయాజాలం

సత్తెనపల్లి, ఫిబ్రవరి 25 : స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో మాయాజాలం నెలకుంది. రెండవ కంటికి తెలియకుండా సరుకులను గల్లంతు చేశారు. అంగన్‌వాడీల సమ్మె కాలంలో కొందరు సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు గుట్టు చప్పుడు కాకుండా చేతి వాటం ప్రదర్శించినట్లు తెలిసింది. ఫిబ్రవరి నెల మూడు వారాలు గడిచినా పౌష్టికాహారం లెక్కలు తేలటం లేదు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలింతలు, గర్భిణులు, మూడు సంవత్సరాల లోపు పిల్లలు, మూడు నుంచి ఆరు సంవత్సరాల లోపు పిల్లలకు పౌష్టికాహారం అందిస్తారు. బియ్యం, కంది పప్పు, వంట నూనె, పాలు, కోడి గుడ్లు ఎన్ని సరఫరా అయ్యాయి, ప్రస్తుతం మిగులు ఎంత?, ఇంకా ఎంత సరఫరా చేయాలన్న లెక్కల్లో చిక్కుముడి నెలకుంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన గర్భిణీ, బాలింతల ఇంటికి పంపిణీ చేసే పౌష్టి కాహారం సమ్మె కాలంలో ఎవరికి ఇచ్చారు?, ఇంత మందికి ఇవ్వలేదన్న వివరాలు రికార్డుల్లో నమోదు కాలేదని తెలుస్తుంది. లబ్ధిదారులకు సరుకులు ఇచ్చినట్లు ముఖ ఆధారిత హాజరులోను మతలపు నెలకుంది. సాంకేతిక సమస్య పేరుతో ఈ వ్యవహారాన్ని తొక్కిపెట్టేస్తున్నారు. అంగన్‌వాడీల సమ్మె కాలంలో కేంద్రాలకు ఇన్‌చార్జ్ బాధ్యతలు నిర్వహించిన సచివాలయ సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహ రించినట్లు తెలుస్తుంది. సత్తెనపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 303 అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ విద్యార్థులకు ఫిబ్రవరి నెలకు సంబంధించిన సరుకులు సక్రమంగా అందలేదు. అంగన్‌వాడీల సమ్మె సమయంలో వాలంటీర్లు, సచివాల య ఉద్యోగులు కేంద్రాలను తెరసి నిల్వ ఉన్న సరుకులను పంపిణీ చేశారు. దీంతో చాలా మంది చేతివాటం ప్రదర్శించారు. గర్భిణీ, బాలింతలకు ఇంటికే పంపిణీ చేసినట్లు నమోదు చేశారు. మూడు నుంచి ఆరు సంవత్సరాల మధ్య పిల్లలకు కేంద్రాల్లోనే వంటా వార్పు చేయాలని చెప్పినా అమలు కాలేదు. సమ్మె జరిగిన కాలంలో సరుకుల గణాంకాల్లో కొంత తేడా ఉన్న మాట వాస్తవమేనని సత్తెనపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు ఏసీడీపీవో సంతోష్ కుమారి తెలిపారు. ఫిబ్రవరి నెలలో ప్రీ స్కూల్ చిన్నారులకు కొన్ని ప్రాంతాల్లో సరుకుల సమస్య వచ్చిన మాట వాస్తవమేనన్నారు. ఇండెట్ సమస్య ఏర్పడిందని, గర్భిణులు, బాలింతలకు చాలా సరుకులు సరఫరా అయ్యాయని, మార్చి మాసంలో సమస్యలు తలెత్తకుండా చూస్తామన్నారు.

వైసీపీ ప్రభుత్వంలో కుంటుపడిన రాష్ట్రాభివృద్ధి

● టీడీపీ నేత ఉల్లం శేషగిరిరావు

సత్తెనపల్లి, ఫిబ్రవరి 25 : వైసీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్ర అభివృద్ధి కుంటుపడిందని హైకోర్టు న్యాయవాది, టీడీపీ నేత ఉల్లం శేషగిరిరావు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒక్కసారి అవకాశం ఇస్తే రాష్ట్రాన్ని వైఎస్ జగన్ అధోగతి పాలు చేశాడన్నారు. రాష్ట్రం రాజధాని లేని రాష్ట్రంగా నిలిచిందన్నారు. ఉపాధి లేక నిరుద్యోగ యువత వలసలు పోతున్నారన్నారు. బీసీ వర్గాలను ప్రభుత్వం అన్ని విధాలా మోసం చేసిందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో బీసీలకు ఇచ్చిన స్థానిక సంస్థల రిజర్వేషన్‌లను పది శాతానికి తగ్గించిన ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. బీసీలను రాజకీయంగా ప్రభుత్వం అణగ దొక్కుతుందన్నారు. బీసీలపై దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, హత్యాకాండలు పెరిగాయన్నారు. సజ్జల రామకృష్ణారెడ్డి, విజయసాయిరెడ్డి, మిధున్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డిలే అంతా తామై వ్యవహరిస్తున్నారన్నారు. అన్ని వర్గాలను మోసం చేసిన ఈ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో బీసీలు తగిన గుణపాఠం చెప్పటం ఖాయమన్నారు.

గురు గోవింద్ సింగ్ మహరాజ్ ఆలయంలో బ్రహ్మారెడ్డి పూజలు

విజయపురిసౌత్, ఫిబ్రవరి 25 : మాచర్ల మండలం చింతలతండాలోని గురుగోవింద్‌సింగ్ ఆలయాన్ని ఆదివారం టీడీపీ మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అనుపు చెంచుకాలనీలో అనారోగ్యంతో బాధపడుతున్న టీడీపీ కార్యకర్త గోపినాయక్‌ను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి యాదవ్, గుండాల శ్రీనివాస్ యాదవ్, కేతావత్ బాబురావు నాయక్, రమావత్ స్వామి నాయక్, వజ్రం నాయక్, బొల్లా వెంకటేశ్వర్లు, రాజ్‌కుమార్, మోతిలాల్‌నాయక్, శ్రీరామ్మూర్తి, గొట్టిముక్కల బాబు పాల్గొన్నారు.

ఘనంగా అంకమ్మతల్లి తిరునాళ్ల

● ప్రత్యేక పూజల్లో పాల్గొన్న కన్నా

రాజుపాలెం, ఫిబ్రవరి 25 : రాజుపాలెం గ్రామంలో కొలువైన శ్రీ అంకమ్మతల్లి తిరునాళ్ల ఆదివారం గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు, భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. తిరునాళ్ల సందర్భంగా గ్రామస్తులు ఐదుచోట్ల అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. నవోదయ ఇంగ్లీష మీడియం పాఠశాల ఆధ్వర్యంలో కోలాట ప్రదర్శన, గ్రామస్తుల ఆధ్వర్యంలో పాటకచేరి, వినోద కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, సత్తెనపల్లి టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అమ్మవారిని దర్శించుకొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సైకో పాలన పోవాలని, ప్రజలందరూ యోగక్షేమాలతో వుండేలా చూడాలని ఆయన అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పల్లపాటి పెద్దిరాజు, తోట నరసయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

చిలకా సత్యంకు నివాళులు

సత్తెనపల్లి, ఫిబ్రవరి 25 : మండలంలోని ధూళిపాళ్ళ మాజీ సర్పంచ్ చిలకా సత్యం దశ దిన కర్మ ఆదివారం ధూళిపాళ్ళలోని ఆయన స్వగృహంలో జరిగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ధూళిపాళ్ళలో టీడీపీ, జనసేన అభివృద్ధికి సత్యం అందించిన సేవలు మరువలేనివని ఆయా పార్టీల నేతలు అన్నారు. ఈ కార్యక్రమంలో బొర్రా వెంకట అప్పారావు, నాదెండ్ల నాగేశ్వరరావు, కొమ్మిశెట్టి సాంబశివ రావు, రంగిశెట్టి సుమన్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కంది పంట దిగుబడిని పరిశీలించిన వ్యవసాయ శాఖ అధికారులు

బెల్లంకొండ, ఫిబ్రవరి 25 : మండలంలోని పాపాయపాలెం, బెల్లంకొండ గ్రామాల్లో కంది పంట దిగుబడులను మండల వ్యవసాయ శాఖ అధికారి కృష్ణయ్య పరిశీలించారు. రైతు భరోసా కేంద్రం ద్వారా కంది పంటను కొనుగోలు చేయాలని సూచించారు. కనీస మద్దతు ధర క్వింటాకు రూ.9,750 ఉంటుందన్నారు. బెల్లంకొండ, పాపాయపాలెం గ్రామాల్లో కంది పంట నాణ్యతా ప్రమాణాల పరిశీలనకు నాలుగు నమూనాలను స్వీకరించాలని అన్నారు. కంది పంటను అమ్మదలచిన రైతులు గ్రామ రైతు భరోసా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేయించు కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్యామ్ ప్రకాష్, ఆషాబీ తదితరులు పాల్గొన్నారు.

దొడ్లేరులో కల్యాణ మండపం ప్రారంభం

క్రోసూరు, ఫిబ్రవరి 25 : మండలంలోని దొడ్లేరులో నూతనంగా నిర్మించిన రావిపాటి కల్యాణ మండపాన్ని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆదివారం ప్రారంభించారు. సుమారు మూడు ఎకరాల విస్తీర్ణంలో రూ.5 కోట్ల ఖర్చుతో కల్యాణ మండపాన్ని నిర్మించినట్టు డాక్టర్ రావిపాటి సాయి కృష్ణ తెలిపారు. పెదకూరపాడు నియోజకవర్గ స్థాయిలో అందరికీ అందుబాటులో ఉండే విధంగా దొడ్లేరు నుంచి పిడుగురాళ్ళ వెళ్ళే రోడ్డులో కల్యాణ మండపాన్ని నిర్మించినట్టు చెప్పారు. దొడ్లేరులో నిర్మించిన కల్యాణ మండపాన్ని మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ సందర్శించి నిర్వాహకులకు అభినందనలు తెలిపారు.

అక్రమంగా విద్యుత్ వాడుతున్న వైర్‌ను కట్ చేయటంతో

సిబ్బందిపై దుర్భాషలు, దాడి

పెదకూరపాడు, ఫిబ్రవరి 25 : పెండింగ్ విద్యుత్ బకాయిలు ఉన్న వారి ఇంటికి వెళ్ళి అక్రమంగా విద్యుత్ వాడుతున్న వైరును చూసి సిబ్బంది కట్ చేయటంతో వారిపై ఇద్దరు దుర్భాషలాడి నెట్టికొట్టిన సంఘటన పెదకూరపాడులో జరిగింది. ఈనెల 23వ తేదీ లైన్‌మెన్ పేరిరెడ్డి, ఏఎల్‌ఎంలు నరేష్, రాము, పుల్లయ్యలతో కలసి రెండు నెలలుగా పెండింగ్ ఉన్న విద్యుత్ బిల్లు గురించి తెలిపేందుకు వెళ్ళామని, విద్యుత్ సర్వీసు నుంచి సోడాబండికి అక్రమంగా విద్యుత్ కనెక్షన్ పెట్టిన విషయాన్ని గమనించి వైరును కట్ చేశామని విద్యుత్ ఏఎల్‌ఎం చెంబేటి రాజేష్ తెలిపారు. ఈనెల 24వ తేదీ రాత్రి 8:30 గంటల సమయంలో పెదకూరపాడులోని సెల్ షాపు వద్ద ఉన్న సమయంలో నా దగ్గరకు ఇరువురు వచ్చి మా సర్వీసు కట్ చేసేవాడవా?, నీకు ఎంత ధైర్యం అంటూ దుర్భాషలాడి కింద పడవేసి కొట్టారని రాజేష్ వివరించారు. ఈ విషయమై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని రాజేష్ వివరించారు.

సత్తెమ్మతల్లికి వెండి కిరీటం, వెండి కలశ బిందె సమర్పించిన భక్తులు

అచ్చంపేట, ఫిబ్రవరి 25 : మండలంలోని మాదిపాడు అటవీ ప్రాంతంలో ఉన్న సత్తెమ్మ అమ్మవారికి కొత్త హరనాథ్‌బాబు వెండి కిరీటం, దివ్వెల రామకృష్ణ వెండి కలశ బిందెను ఆదివారం సమర్పించారు.

కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి దేవస్థాన డైరెక్టర్ దివ్వెల రామకృష్ణ దంపతులు దేవస్థానానికి వెండి బిందెను సమర్పించగా అచ్చంపేటకు చెందిన కొత్త హరనాథ్‌బాబు వెండి కిరీటం అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా దేవస్థాన కమిటీ చైర్మన్ కొరివి వెంకట నరేష్, ఎంపీటీసీ భూక్యా స్వర్ణమ్మ బాయి, దేవరశెట్టి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.



గుంతలమయంగా ఉన్న పేటసన్నిగండ్ల - నరమాలపాడు రహదారి

నరకంగా నరమాలపాడు రహదారి

● గుంతలు పూడ్చని అధికారులు

కారంపూడి, ఫిబ్రవరి 25 : మండలంలోని పేటసన్నిగండ్ల నుంచి నరమాలపాడు రహదారి ప్రయాణం నరకంగా ఉంది. పది కిలోమీటర్ల మేర ఉన్న ఈ రహదారిలో గుంతలు అధికంగా ఉన్నాయి. అడుగడుగుకు గుంతలు ఉండడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గం గుండా ప్రయాణమంటేనే హడలిపోతున్నారు. రహదారిపై గుంతలు పడి దాదాపు నాలుగేళ్లయింది. అయినప్పటికీ ఇప్పటి వరకు మరమ్మతులు మాత్రం చేపట్టలేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు నిత్యం ఈ రహదారిలో ప్రయాణిస్తున్నప్పటికీ పట్టించుకోవటం లేదు. రాత్రి వేళల్లో ఈ రహదారి మరింత భయానకంగా మారింది. గుంతలు అర్థంకాక రోడ్డు ప్రమాదాలు జరిగి ఎంతో మంది ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు అనేకం ఉన్నాయి. బస్సు ప్రయాణికుల బాధలూ చెప్పనలివి కాకుండా ఉంది. ఈ రహదారిలో బస్సు పూర్తిగా ఎత్తేస్తుండడంతో ఒళ్లు నొప్పులతో అల్లాడిపోతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించాలని వాహన చోదకులు, ప్రయాణికులు కోరుతున్నారు.

కాపులను మోసం చేసిన వైసీపీ ప్రభుత్వం

● టీడీపీ, జనసేన నేతల ఆరోపణ

సత్తెనపల్లి, ఫిబ్రవరి 25 : వైసీపీ ప్రభుత్వం కాపులను మోసం చేసిందని జనసేన జిల్లా అధికార ప్రతినిధి తవిటి భవన్నారాయణ, టీడీపీ నేతలు కంభాల వెంకటేశ్వరరావు, బత్తుల ఆదినారాయణ, తోట శ్రీనివాసరావు అన్నారు. టీడీపీ ప్రజా వేదికలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం కాపులకు కల్పించిన ఐదు శాతం రిజర్వేషన్‌లను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసి కాపులకు వెన్నుపోటు పొడిచిందన్నారు. ప్రభుత్వంలో భాగస్వామి అయిన మంత్రి అంబటి రాంబాబు దీనిపై మాట్లాడలేదన్నారు. పవన్ కళ్యాణ్‌ను అంబటి విమర్శించటం తగదన్నారు. కాపులంతా ఐక్యంగా ఉండి జనసేన, టీడీపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తెస్తారన్నారు. వైసీపీలో మంత్రిగా ఉన్న అంబటికి కాపుల గురించి మాట్లాడే అర్హత కూడా లేదన్నారు. ప్రజలు, రైతుల సమస్యలు పట్టని అంబటి రాంబాబు రోడ్లపై డ్యాన్స్‌లు వేసుకుంటే మంచిదన్నారు. పల్నాడు ప్రాంతంలో తిరునాళ్ల ప్రారంభమైన సందర్భంగా అంబటి నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేస్తే బాగుంటుందన్నారు.

ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్న జగన్

● టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సంగీతరావు

సత్తెనపల్లి, ఫిబ్రవరి 25 : సిద్ధం సభల పేరుతో సీఎం వైఎస్ జగన్ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నాడని టీడీపీ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బొక్కా సంగీతరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్, మంత్రి వర్గం ప్రజల్లో ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను కప్పి పుచ్చుకోవటానికి మహా సభలను నిర్వహిస్తున్నారన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక దళితులపై దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, అత్యాచారాలు జరిగాయన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణను దళితులు గెలిపించుకోవటం ఖాయమని ఆయన పేర్కొన్నారు.

భవిష్యత్తు జనసేన, టీడీపీ ప్రభుత్వానిదే

● నియోజకవర్గ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, ఫిబ్రవరి 25 : భవిష్యత్ టీడీపీ, జనసేన ప్రభుత్వానిదేనని టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని టీడీపీ ప్రజా వేదికలో ఆదివారం సాయంత్రం 6, 14 వార్డులకు చెందిన వడ్డెర, రజక సామాజిక వర్గాలకు చెందిన పది కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి. వారికి కన్నా పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కన్నా లక్ష్మీనారాయణను టీడీపీ అభ్యర్థిగా ఎంపిక చేసినందుకు హర్షం వ్యక్తం చేస్తూ తెలుగు మహిళలు కేక్ కట్ చేయించారు. ఈ కార్యక్రమంలో భీమినేని వందనాదేవి, తోట అంబిక, పమిడి రామ దుర్గా, మన్నవ శారదాదేవి, దూదేకుల హుస్సేన్‌బీ, గొర్రెపాటి సుశీల, అహల్యారాణి, గురజాల మల్లేశ్వరి, వీ.మాధురి, బండారుపల్లి సంధ్య, బీ నాగవర్ధనమ్మ, రమాదేవి, భీమినేని పద్మ, చెన్నమల్లు భారతి, ఈదర రత్నకుమారి, చెట్టు పద్మ, బోడెంపూడి రాజేశ్వరి, ప్రవీణ్, పలువురు తెలుగు మహిళలు పాల్గొన్నారు.


కన్నా సమక్షంలో టీడీపీలో చేరిన రజక కుటుంబాలు, చిత్రంలో తెలుగు మహిళలు

శ్రీ వైష్ణవ సంఘం సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : కన్నా

సత్తెనపల్లి, ఫిబ్రవరి 25 : శ్రీ వైష్ణవ సంఘం సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలో ఆదివారం చేత్తాద శ్రీ వైష్ణవ సంఘం ఆత్మీయ సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సంఘ నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం, జనసేన కూటమి ప్రభుత్వాన్ని గెలిపించాలన్నారు. సంఘ పెద్దలు తమ సమస్యలను కన్నా దృష్టికి తీసుకువెళ్ళారు. ప్రభుత్వం అధికారంలోకి రాగానే సమస్యలను పరిష్కరిస్తానని కన్నా లక్ష్మీనారాయణ వారికి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు కన్నా లక్ష్మీనారాయణను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. సమావేశంలో సంఘ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చేతి రాతతో పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించాలి

పెదకూరపాడు, ఫిబ్రవరి 25 : పదవ తరగతి విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఒత్తిడికి గురికాకుండా చక్కటి చేతి రాతతో పరీక్షలు రాసి మంచి ఉత్తీర్ణత సాధించి గ్రామానికి మంచిపేరు తేవాలని చిత్తూరు జిల్లా పుత్తూరు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, కమ్మ జన సంఘం గౌరవ అధ్యక్షుడు శాఖమూరి వెంకటేశ్వర్లు నాయుడు అన్నారు. పెదకూరపాడులోని జడ్పీ హైస్కూల్‌లో జన చైతన్య సమితి సహకారంతో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు స్టడీ అవర్లను పురస్కరించుకొని ఆదివారం సాయంత్రం న్యూట్రీషన్ ఫుడ్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బుచ్చయ్యపాలెం మాజీ సర్పంచ్ పరుచూరి పూర్ణచంద్రరావు, సత్తెనపల్లి బ్రాంచ్ ఎల్ఐసీ ఏజెంట్ల అసోసియేషన్ అధ్యక్షుడు మంచాల రమేష్, ప్రధానోపాధ్యాయులు కాకాణి వెంకట రమణ, జనసేన చైతన్య సమితి కో-ఆర్డినేటర్ వెలితోటి అనీల్ కుమార్, గ్రామ పెద్దలు షేక్ మాబూ, సీహెచ్ వెంకట నాగరాజు, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు. 10వ తరగతి పరీక్షలు అయ్యేంత వరకు విద్యార్థులకు న్యూట్రీషన్ ఫుడ్ అందిస్తామని నిర్వాహకులు తెలిపారు.



న్యూట్రీషన్ ఫుడ్ పంపిణీ చేస్తున్న వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లునాయుడు

పేదలకు దుప్పట్లు పంపిణీ

సత్తెనపల్లి, ఫిబ్రవరి 25 : పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో గాంధీ విగ్రహం వద్ద భారతీయ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం చల్లా వెంకాయమ్మ వర్ధంతి సందర్భంగా 30 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దూపగుంట్ల జానకి రామారావు, ఆంజనేయులు ఇర్మియా, ప్రభుదాసు పాల్గొన్నారు.

అన్నదానానికి కొమ్మాలపాటి రూ.లక్ష ఆర్థిక సాయం

బెల్లంకొండ, ఫిబ్రవరి 25 : బెల్లంకొండపై ఉన్న శ్రీ వెంకటేశ్వరస్వామి ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ అన్నదాన కార్యక్రమానికి రూ.లక్ష విరాళంగా అందజేశారు. రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్, మరి కొంత మంది టీడీపీ నాయకులు ఆదివారం ఆలయ కమిటీ వారికి అందజేశారు. మస్తాన్ షరీఫ్ మాట్లాడుతూ బెల్లంకొండ కొండపై ఉన్న వెంకటేశ్వర స్వామి వారి దేవాలయానికి 2017లోనే ఘాట్ మార్గాన్ని ఏర్పాటు చేసిన ఘనత కొమ్మాలపాటి శ్రీధర్‌దేనన్నారు. బెల్లంకొండ మండలంలో ఏ కార్యక్రమం మొదలు పెట్టినా కొమ్మాలపాటి శ్రీధర్ సహాయ సహకారాలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంకొండ సర్పంచ్ గడ్డిపర్తి జ్యోతి సముద్రం, వైస్ సర్పంచ్ మునగపాటి సుభానీ, చిట్టి, ఎన్.పిచ్చయ్య, పీఎస్‌కే రసూల్, సయ్యద్ జబ్బార్, గుంటూరు సాయి, బీసీ సంఘం మండల అధ్యక్షుడు గుంజా గంగారావు తదితరులు పాల్గొన్నారు.


వెంకటేశ్వర స్వామి ప్రతిష్ఠ మహోత్సవ అన్నదానానికి లక్ష రూపాయల విరాళం ఇస్తున్న టీడీపీ నాయకులు

దిక్సూచి DIKSUCHI

టెలీపతి... అంటే మనం మనసులో అనుకున్న విషయం, అదే సమయంలో మన ఆత్మీయులకు సైతం మానసికంగా స్ఫురించడం. అంటే వ్యక్తుల మధ్య ఉన్న దూరంతో సంబంధం లేకుండా వారి మనసుల మధ్య జరిగే కమ్యూనికేషన్‌గా దీనిని చెప్పుకోవచ్చు. ఇప్పటివరకూ ఇది, అరుదుగా సంభవిస్తున్నా, ఒక ప్రామాణికత లేని భావనే.


'న్యూరా లింక్ ప్రాజెక్ట్' సృష్టికి ప్రతిసృష్టి!

ప్రస్తుతం ఎలాన్ మస్క్‌కు చెందిన 'న్యూరా లింక్స్' సంస్థ ప్రయోగాత్మకంగా ఒక వ్యక్తి మెదడులో కంప్యూటర్ చిప్‌ను విజయవంతంగా అమర్చడం ద్వారా మనసుతోనే కంప్యూటర్‌ను ఆపరేట్ చేయగలిగే సౌలభ్యం అందుబాటులోకి వచ్చింది. ఈ ప్రాజెక్టు పేరు సైతం 'టెలీపతి' కావడం గమనార్హం. ఈ తాజా పరిశోధన ఎందరికో ఆశాదీపం కాగా, వ్యక్తిగత గోప్యతకు మాత్రం భవిష్యత్తులో గొడ్డలిపెట్టుగా మారనుందన్న ఆందోళనలు వెల్లువెత్తుతున్నాయి.

న్యూరాలింక్ టెలీపతి (చెయిన్ కంప్యూటర్ ఇంటర్‌ఫేస్)

న్యూరాలింక్ సంస్థ చేపట్టిన బ్రెయిన్, కంప్యూటర్ అనుసంధాన ప్రాజెక్టు (బ్రెయిన్ కంప్యూటర్ ఇంటర్‌ఫేస్)కు 'టెలీపతి' అని నామకరణ చేశారు. ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం, చిప్ అమర్చిన మానవ మెదడులోని ఆలోచనలకు అనుగుణంగా కంప్యూటర్‌ను పనిచేయించడం. మనిషి మెదడు ప్రధానంగా రెండు రకాల విధులను నిర్వర్తిస్తుంది.

1) జ్ఞానేంద్రియపరమైన విధులు (సెన్సరీ ఫంక్షన్స్)
2) కదలికలపరమైన విధులు (మోర్టార్ ఫంక్షన్)



జ్ఞానేంద్రియాలకు, మెదడుకు మధ్య ఉండే అనుసంధానత ద్వారా రుచి, వాసన, స్పర్శ వంటి అనుభూతులను పొందగలం. ఇవి జ్ఞానేంద్రియాలపరంగా మెదడు నిర్వర్తించే సెన్సరీ ఫంక్షన్స్. అదేవిధంగా కళ్లు తెరవడం, నడవడం, చేతులు కదపడం వంటి మానవ శరీర కదలికలు ఆయా అవయవాలకు, మెదడుకు మధ్య గల అనుసంధానత వల్ల సాధ్యపడతాయి. ఇవి మెదడు నిర్వర్తించే మోర్టార్ ఫంక్షన్స్.

ఈవిధంగా మనిషి కదలికలు, అనుభూతులు, శరీరంలో ఉత్పత్తయ్యే హార్మోన్ల వంటి వివిధ రసాయనిక చర్యలన్నింటికీ మెదడు ఆయా అవయవాలకు ఇచ్చే సంకేతాలే కారణం. ఒక అధునాతన వైర్‌లెస్ చిప్‌ను మెదడులో అమర్చడం ద్వారా ఆ చిప్‌లోని ఎలక్ట్రోడ్స్ మెదడు ఇచ్చే సంకేతాలను గ్రహించి, అనుసంధానిత వస్తువులతో కమ్యూనికేషన్ జరుపుతాయి. ఇంటర్నెట్ అనుసంధానత గల ఏ పరికరాన్ని అయినా ఈ కమ్యూనికేషన్ విధానంలో వైర్‌లెస్‌గా, కేవలం మెదడులో జరిగే ఆలోచనల ద్వారా నియంత్రించవచ్చు.

టెలీపతి ప్రాజెక్టులో భాగంగా చిప్ అమర్చిన వ్యక్తి మెదడులోని ఆలోచనల ద్వారా కంప్యూటర్ మౌస్‌ను నియంత్రిస్తూ, కంప్యూటర్‌ను ఆపరేట్ చేయించగలుగుతారు. ఈ విధానాన్ని 'బ్రెయిన్ కంప్యూటర్ ఇంటర్‌ఫేస్'గా వ్యవహరిస్తున్నారు.

మానవ మస్తిష్కంలో అమర్చే ఈ వైర్‌లెస్ చిప్‌లో మనిషి వెంట్రుకతో పోల్చిన 20వ వంతు మందం మాత్రమే కలిగిన సన్నని ఎలక్ట్రోడ్స్ దాదాపు మూడువేల వరకూ అమర్చి ఉంటాయి. మస్తిష్క నాడీవ్యవస్థలో కీలకమైన వెన్నెముక దెబ్బతినడం, పక్షవాతం, ఆటిజం వంటి సమస్యల వల్ల కదలికల పరమైన సమస్యలు గల వ్యక్తులకు ఈ పరిశోధన ఒక వరమని చెప్పవచ్చు.

అంతేకాక భవిష్యత్తులో ఈ 'బ్రెయిన్ కంప్యూటర్ ఇంటర్‌ఫేస్' రంగంలో మరిన్ని ఆవిష్కరణలు సాధ్యపడి సరికొత్త పరికరాల సృష్టి ద్వారా నడవలేనివారు నడవవచ్చు, వినలేనివారు, మాట్లాడలేనివారు, చూడలేనివారు, ఆ పనులను సైతం చేయవచ్చు. అదేవిధంగా ఎంటర్‌టైన్‌మెంట్ రంగం కూడా కొత్త పుంతలు తొక్కే అవకాశముంది. ఇప్పటివరకూ త్రీడీ, వర్చువల్ అనుభూతులను పొందిన ప్రేక్షకులు ఇకపై ఈ కొత్త సాంకేతికతకు సెన్సరీ ఫంక్షన్స్ జత అయితే అనుభవపూర్వక ఆస్వాదనలూ పొందవచ్చు. రుచి, వాసన, బాధ, స్పర్శ వంటి భావోద్వేగ అనుభూతులు అందివస్తాయి. అయితే ప్రస్తుతం కేవలం కదలికలకు సంబంధించిన మోర్టార్ ఫంక్షన్స్‌లో వైద్యపరమైన ప్రయోగాలకు మాత్రమే అనుమతి ఉంది. ఈ పరిజ్ఞానం ద్వారా ఎదురయ్యే సమస్యలను దృష్టిలో ఉంచుకొని ఇతరత్రా ప్రయోగాలకు ప్రస్తుతం అమెరికా ప్రభుత్వం అనుమతి నిరాకరించింది. ప్రయోజనాల మాట అటుంచితే అనేక సమస్యలను ఈ సరికొత్త టెక్నాలజీ ఆహ్వానిస్తోంది. కేవలం మానవ మస్తిష్కంలో మాత్రమే ఇంతవరకూ గోప్యత సాధ్యమవుతూ వచ్చింది. ఈ టెక్నాలజీ ద్వారా ఇకపై అంతరంగిక గోప్యత సాధ్యపడకపోవచ్చు. నేరపరిశోధన వంటి కొన్ని విషయాలకు, లైవ్ డిటెక్టర్ వలె ఇది ఉపయోగపడినప్పటికీ, వ్యక్తిగత స్వేచ్ఛకు భారీ ప్రమాదం పొంచి ఉంది. ఆధార్‌లోని బయోమెట్రిక్ సమాచారాల చౌర్యం ద్వారా అనేక నేరాలు జరుగుతున్న ఈ తరుణంలో మనసులోని గుట్టును సైతం వెలికితీయగల అవకాశం ఉన్న ఈ టెక్నాలజీతో జరగనున్న దారుణాలు ఊహాతీతంగా చెప్పుకోవచ్చు.

> భవిష్యత్తులో ఈ 'బ్రెయిన్ కంప్యూటర్ ఇంటర్‌ఫేస్' రంగంలో మరిన్ని ఆవిష్కరణలు సాధ్యపడి సరికొత్త పరికరాల సృష్టి ద్వారా నడవలేనివారు నడవవచ్చు, వినలేనివారు, మాట్లాడలేనివారు, చూడలేనివారు, ఆ పనులను సైతం చేయవచ్చు. అదేవిధంగా ఎంటర్‌టైన్‌మెంట్ రంగం కూడా కొత్త పుంతలు తొక్కే అవకాశముంది. ప్రాకృతిక స్వాభావికతకు విభిన్నంగా 'త్రిశంకు స్వర్గాన్ని' పోలిన ప్రతిసృష్టిని ముందుందు ఉంచవచ్చు. అయితే అనుకూలతలతో పాటు ప్రతికూలతలు కూడా మెండుగానే ఉంటాయి.



మనిషి చిప్ అమర్చుకున్న మస్తిష్కం ద్వారా వివిధ పరికరాలను వైర్‌లెస్‌గా, అంతర్జాల అనుసంధానతతో పనిచేయించడం అంటే అనేక నేరాలు చేతికి మట్టి అంటకుండా పూర్తి చేసేయడానికి సైతం అవకాశం చిక్కినట్లే.

ఇదేవిధంగా వ్యక్తుల మస్తిష్కాల మధ్య ఈ చిప్ అనుసంధానత ఏర్పరిస్తే సరికొత్త కమ్యూనికేషన్ సిస్టమ్ సైతం ఏర్పడుతుంది. దీని ప్రయోజనాలు, నష్టాలు కూడా ఊహాతీతంగానే ఉంటాయి. నయా బానిసత్వం, నయా ఉగ్రవాదం వంటి సరికొత్త ధోరణులు సైతం ఆవిర్భవించవచ్చు. ఒక వ్యక్తి ఆలోచనలు తెలుసుకోగలిగే అవకాశం ఉండటంతో మానవ సంబంధాలు దెబ్బతినవచ్చు.

జంతువుల మెదళ్లలో సైతం ఈ చిప్‌లను ప్రయోగాత్మకంగా అమర్చి నూరాలింక్స్ సంస్థ పరిశీలించింది. ఒక కోతి వీడియో గేమ్‌ను ఆడగలిగింది. ఈవిధంగా ఈ పరిశోధనలు మరింత ముందుకువెళితే జంతువులు సైతం కృత్రిమ మేధతో అనుసంధానించడం ద్వారా వాటి ప్రవర్తనలో మార్పులు వస్తాయి.

ప్రాకృతిక స్వాభావికతకు విభిన్నంగా 'త్రిశంకు స్వర్గాన్ని' పోలిన ప్రతిసృష్టిని ముందుందు ఉంచవచ్చు. అనేక వ్యాధులు, వైకల్యాలపరంగా వరం అయిన ఈ సాంకేతికత, మానవ సంబంధాలు, అపూయిత్యాలపరంగా మాత్రం మానవాళికి శాపంగా పరిణమించే అవకాశం ఉంది. క్లోనింగ్ వంటి జీవశాస్త్ర సాంకేతికతలను నియంత్రించినవిధంగానే ఈ బ్రెయిన్ కంప్యూటర్ ఇంటర్‌ఫేస్‌ను, వైద్యపరమైన ప్రయోజనాలకు మాత్రమే అనుమతించడం వల్ల మానవాళి ప్రమాదంలో పడకుండా ఉంటుంది.




ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

మిస్సింగ్ నంబర్ టెస్ట్

రీజనింగ్

పార్ట్-2

1. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?




ఎ) 12 బి) 13 సి) 18 డి) 15

సమాధానం: (డి)

వివరణ: మొదటి డయాగ్రామ్‌లో 12 - 4 = 8, 9 - 3 = 6 (8 + 6 = 14)
రెండో డయాగ్రామ్‌లో 8 - 5 = 3, 23 - 15 = 8 (3 + 8 = 11)
కాబట్టి మూడో డయాగ్రామ్‌లో 16 - 13 = 3,
18 - 6 = 12 (3 + 12 = 15)

2. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?



ఎ) 60 బి) 56 సి) 48 డి) 36

సమాధానం: (సి)

వివరణ: ప్రతి డయాగ్రామ్‌లో పైన కుడివైపు గల సంఖ్యను 4తో గుణిస్తే ఎడమ వైపు సంఖ్య, 6తో గుణిస్తే డయాగ్రామ్‌కు కింద గల సంఖ్యగా వస్తుంది.
14 x 4 = 56 8 x 4 = 32
14 x 6 = 84 8 x 6 = 48
కావున 12 x 4 = 48, 12 x 6 = 72

3. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?


6	12	9
8	7	6
14	19	?

ఎ) 12 బి) 15 సి) 54 డి) 22

సమాధానం: (బి)

వివరణ: నిలువుగా 6 + 8 = 14, 12 + 7 = 19
కాబట్టి 9 + 6 = 15 సమాధానం అవుతుంది.

4. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?




ఎ) 261 బి) 216 సి) 48 డి) 252

సమాధానం: (బి)

వివరణ: సరళ రేఖలు ఒకపక్క చిన్న సంఖ్య మరొక పక్క ఆ చిన్న సంఖ్య ఘనం.
3^3=27, 5^3=125, 4^3=64. కావున 6^3=216

5. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?




ఎ) 10 బి) 15 సి) 18 డి) 16

సమాధానం: (ఎ)

వివరణ: పై డయాగ్రామ్‌లో రెండు అంకెల లబ్ధం నుంచి కింద రెండు అంకెల మొత్తాన్ని తీసివేస్తే చిన్న వృత్తంలో గల సంఖ్య వస్తుంది.
8 x 6 = 48 10 + 12 =22 48 - 22 = 26
9 x 7 = 63 13 + 14 = 27 63 - 27 = 36
కాబట్టి 4 x 9 = 36 11 + 15 = 26
36 - 26 = 10 సమాధానము అవుతుంది.

6. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?



ఎ) 25 బి) 24 సి) 18 డి) 27


సమాధానం: (ఎ)

వివరణ: వృత్తానికి నాలుగువైపుల గల సంఖ్యలు వివిధ అంకెల వర్గాలు. ఆయా అంకెలను కూడిన వృత్తంలో గల సంఖ్య వస్తుంది
64 అంటే 8^2, 25 అంటే 5^2, 36 అంటే 6^2, 81 అంటే 9^2.



8 + 5 + 6 + 9 = 28
49 అంటే 7^2, 36 అంటే 6^2, 25 అంటే 5^2, 16 అంటే 4^2.
7 + 6 + 5 + 4 = 22 అదే విధంగా
49 అంటే 7^2, 36 అంటే 6^2, 16 అంటే 4^2, 64 అంటే 8^2.
7 + 6 + 4 + 8 = 25 సమాధానం అవుతుంది.

7. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?



ఎ) 196 బి) 162 సి) 289 డి) 361

సమాధానం: (ఎ)

వివరణ: 8 + 4 = 12 12^2 = 144
6 + 2 = 8 8^2 = 64
7 + 2 = 9 9^2 = 81అదే విధముగా 9 + 5 = 14
14^2 = 196
సమాధానం అవుతుంది.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్
సీనియర్ ఫ్యాకల్టీ

టీడీపీ హయాంలో మాదిగ ఉపకులాలకు లబ్ధి

» 25 వేల మందికి ఉద్యోగాలొచ్చాయి: మంద కృష్ణ మాదిగ

తుమ్మపాల(అనకాపల్లి), ఫిబ్రవరి 25: తెలుగుదేశం పార్టీ పాలనలో మాదిగ ఉప కులాలకు చెందిన 25వేల మంది ఉద్యోగాలు పొందారని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ అన్నారు. ఆదివారం రాత్రి అనకాపల్లిలో జరిగిన ఎంఆర్‌పీఎస్ సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ జరిగితే 59 ఉప కులాలకు న్యాయం జరుగుతుందని, దీనికోసం 30 ఏళ్లుగా ఉద్యమిస్తున్నామని చెప్పారు. ఎస్సీ వర్గీకరణపై ఏడుగురు న్యాయమూర్తులతో కూడిన సుప్రీంకోర్టు బెంచ్ తీర్పును రిజర్వు చేసిందని, వర్గీకరణకు అనుకూలంగా తీర్పు వచ్చే అవకాశం ఉందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

రెచ్చిపోయిన మద్యం మాఫియా

» సెబ్ పోలీసులపై విరుచుకుపడి దాడి..అనంతలో ఘటన

హిందూపురం, ఫిబ్రవరి 25: మద్యం మాఫియా రెచ్చిపోయింది. ఏకంగా కర్ణాటక మద్యాన్ని పట్టుకున్న సెబ్ పోలీసులపైనే దాడికి తెగబడింది. శ్రీసత్యసాయి జిల్లా పరిగి మండలం శ్రీరంగరాజులపల్లి వద్ద కర్ణాటక సరిహద్దులో శనివారం రాత్రి సెబ్ హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్, వాహన డ్రైవర్ పురుషోత్తంపై మద్యం మాఫియా దాడి చేసింది. హిందూపురం సెబ్ పోలీసు స్టేషన్‌లో పనిచేసే హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్, వాహన డ్రైవర్ పురుషోత్తం శ్రీరంగరాజులపల్లి వద్ద కర్ణాటక సరిహద్దులో వాహన తనిఖీలు చేపట్టారు. అటుగా బైక్‌లో ఇద్దరు వ్యక్తులు వచ్చారు. వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా.. రెండు బాక్సుల కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు గుర్తించారు. బండి పక్కకు ఆపమని వివరాలు ఆరాతీస్తుండగా ద్విచక్ర వాహనంపై వచ్చిన ఓ వ్యక్తి అక్కడి నుంచి పరారయ్యాడు. కర్ణాటకలోని విట్లాపురానికి చెందిన వారికి సమాచారం ఇచ్చాడు. ఆ గ్రామం నుంచి ఐదారుగురు అక్కడికి చేరుకున్నారు. వచ్చీరాగానే హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్‌పై దాడి చేయబోగా.. అక్కడే ఉన్న పోలీసు వాహన డ్రైవర్ అడ్డుకునేందుకు యత్నించారు. దుండగులు కర్రలతో పురుషోత్తం తలపై బాదారు. ఆయన కిందపడిపోగా ద్విచక్రవాహనం, మద్యంతో పరారయ్యారు. కాసేపటి తర్వాత తేరుకుని హెడ్‌కానిస్టేబు ల్, డ్రైవర్ హిందూపురానికి వచ్చి ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నారు.

'చలో'పై తలో మాట

» తాత్కాలికంగా వాయిదా వేస్తున్నాం
» 49 డిమాండ్లపై ప్రభుత్వం లిఖితపూర్వక హామీ: ఏపీజేఏసీ
» ఏ ఒక్క సమస్య పరిష్కరించకుండా ఎందుకీ నిర్ణయం?
» ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలను తప్పుదోవ పట్టిస్తున్నారు
» ఏపీజేఏసీ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం: యూటీఎఫ్
» ప్రభుత్వం నుంచి హామీలు లేకుండా వాయిదా ఎందుకు?
» ఇలాంటి నిర్ణయం ఉద్యోగులను వంచించడమే: ఏపీటీఎఫ్

విజయవాడ/అమరావతి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): 'చలో విజయవాడ' కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినట్టు ఏపీజేఏసీ చైర్మన్ బండి శ్రీనివాసరావు, సెక్రటరీ జనరల్ బి.హృదయరాజు ప్రకటించారు. విజయవాడలోని ఏపీ ఎన్జీవో భవన్‌లో ఆదివారం సాయంత్రం రాష్ట్ర నాయకత్వంతో వీరిద్దరూ అత్యవసరంగా వర్చువల్ విధానంలో సమావేశమయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బండి శ్రీనివాసరావు మాట్లాడారు. ఏపీజేఏసీ తరఫున 49 డిమాండ్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వినతిపత్రం ఇచ్చామని చెప్పారు. ఆ మేరకు గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ (జీవోఎం) తమతో రెండు సమావేశాలు నిర్వహించిందని, తమ డిమాండ్లపై రాతపూర్వకమైన హామీ ఇవ్వటంతో పాటు వారంలో సమావేశం నిర్వహిస్తానని సీఎస్ చెప్పటం వల్లే 27న నిర్వహించ తలపెట్టిన 'చలో విజయవాడ'ను తాత్కాలికంగా వాయిదా వేశామని వివరించారు. ప్రభుత్వం ముందుంచిన డిమాండ్లపై నిర్దిష్టమైన హామీలు వచ్చాయన్నారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్, పోలీసుల టీఏ, డీఏ, సీపీఎస్ మ్యాచింగ్ గ్రాంట్ వంటివి జమచేయడం ద్వారా ప్రభుత్వం రూ.250 కోట్లు విడుదల చేసిందని తెలిపారు. 12వ పీఆర్సీకి 9మంది సిబ్బందిని నియమిస్తూ జీవో జారీ చేశారని చెప్పారు. జూలైలో నేరుగా పీఆర్సీ అమలు చే స్తామని హామీ ఇచ్చారని చెప్పారు. 2004కి ముందు నోటిఫికేషన్ ద్వారా ఎంపికై ఆ తర్వాత ఉద్యోగాల్లో చేరిన టీచర్లు, పోలీసులు, ఇతర ఉద్యోగులకు ఓపీఎస్ అమలు, పెన్షనర్లకు అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ పునరుద్ధరణ, స్థానిక సంస్థల్లో (జడ్పీ, ఎయిడెడ్) కారుణ్య నియామకాలు, కాంట్రాక్టు ఉద్యోగులను విడతలవారీగా క్రమబద్ధీకరించడం, మహిళా టీచర్లు, ఉద్యోగినులకు చైల్డ్‌కేర్ లీవ్‌లు నిర్దిష్ట గడువు లేకుండా ఎప్పుడైనా వాడుకునే అవకాశంతో పాటు వివిధ శాఖల్లో సమస్యల పరిష్కారానికి సంబంధించి లిఖితపూర్వక హామీ ఇచ్చిన నేపథ్యంలో ఏపీజేఏసీ రాష్ట్ర సభ్యుల అభిప్రాయాల మేరకు 'చలో విజయవాడ'ను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్టు బండి శ్రీనివాసరావు వివరించారు.

రేపు జిల్లా కేంద్రాల్లో నిరసనలు: ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ ఉద్యమంలోకి దిగిన ఏపీజేఏసీ నాయకులపై ముందస్తుగా బైండోవర్ కేసులు పెట్టడం, నోటీసులు ఇవ్వడం, నిర్బంధించడాన్ని నిరసిస్తూ 27న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసన తెలుపుతామని బండి శ్రీనివాసరావు ప్రకటించారు.

ఏపీజేఏసీ నిర్ణయం సరికాదు: యూటీఎఫ్

లక్షలాది మంది ఉద్యోగ, ఉపాధ్యాయ ఆకాంక్షలకు అనుగుణంగా పోరాడాల్సిన ఏపీజేఏసీ.. ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత సాధించకుండానే 'చలో విజయవాడ' పిలుపును వాయిదా వేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ ప్రసాద్ పేర్కొన్నారు. విజయవాడలోని యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఏ ఒక్క సమస్య పరిష్కరించకుండా ప్రభుత్వ ఉద్యోగ సంఘాలను, ఉపాధ్యాయ సంఘాలను తప్పుదోవ పట్టిస్తున్నారని, ఉద్యమం చేయాల్సిన సమయంలో అర్ధంతరంగా వాయిదా వేయడాన్ని యూటీఎఫ్ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. పోరాటాన్ని కొనసాగించాలని ఏపీజేఏసీని కోరారు. సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, సహాధ్యక్షులు కె.సురేష్‌కుమార్, ఏఎన్ కుసుమకుమారి, కోశాధికారి బి.గోపీమూర్తి, రాష్ట్ర కార్యదర్శులు, వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు. కాగా, ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రయోజనాలు పొందకుండానే చలో విజయవాడను వాయిదా వేయడం ఉద్యోగ, ఉపాధ్యాయులను వంచించడమేనని ఏపీ టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చెన్నుపాటి మంజుల, కె.భానుమూర్తి అన్నారు. పీఆర్సీ, ఐఆర్ ఏ విషయంలోనూ ప్రభుత్వం నుంచి హామీ లేకుండా ఎందుకు వాయిదా వేశారని నిలదీశారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఏపీజేఏసీ నేతలు

వేదవతిని గుల్ల చేశారు!

» నదిలో ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు
» రోజూ వందల ట్రాక్టర్లలో అక్రమంగా రవాణా
» మంత్రి జయరాం సోదరుల దందా
» ఎల్లెల్సీ టెండర్లూ తమ వారికే

(కర్నూలు-ఆంధ్రజ్యోతి)

కర్నూలు జిల్లాలో వేదవతి నదిని ఇసుక మాఫియా గుల్లచేసింది. మంత్రి గుమ్మనూరు జయరాం అండతో అనుమతులు లేకపోయినా ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వేసి అక్రమంగా రవాణా చేశారు. అధికారం మాటున అక్రమార్కులు రోజూ వందల ట్రాక్టర్లలో ఇసుకను తరలించారు. ఏ అధికారైనా ప్రశ్నిస్తే క్షణాల్లో మంత్రి సోదరుల నుంచి ఫోన్లు రావడంతో అక్కడే ట్రాక్టర్లు వదిలేసి వెళ్లేవారు. దీంతో యథేచ్ఛగా ప్రకృతి వనరులను కొల్లగొట్టిన మంత్రి అనుచరులు, సోదరులు రూ.కోట్లకు పడగలెత్తారు. కర్నూలు జిల్లాలో ఏపీ- కర్ణాటక సరిహద్దులో వేదవతి నది ప్రవహిస్తోంది. ఆలూరు నియోజకవర్గంలో హాలహర్వి, హోళగుంద మండలాల నుంచి కర్ణాటకలోని శిరుగుప్ప నియోజకవర్గంలో అడుగుపెట్టి తుంగభద్ర నదిలో కలుస్తుంది. హలహర్వి మండలం గూళ్యం, జె.హోసల్లి, హోళగుంద మండలం మార్లమడికి గ్రామాల సమీపంలో ఇసుక నిల్వలు ఉన్నాయి. అయితే ఎక్స్‌కవేటర్లు పెట్టి తవ్వే స్థాయిలో నిల్వలు లేవని, ఇక్కడ ఇష్టానుసారంగా ఇసుక తవ్వకాలు చేస్తే భూగర్భ జలా లు అడుగంటి రైతులు, సమీప గ్రామాలు తీవ్రం గా నీటి ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి వస్తుందని ఇరిగేషన్, మైనింగ్, గ్రామీణ తాగు నీటి విభాగం అధికారుల కమిటీ ఇసుక రీచ్ ఏర్పాటు కు అనుమతి ఇవ్వలేదు. స్థానిక ప్రజల అవసరా ల నిమిత్తం ఎద్దుల బండ్లపై మాత్రం ఇసుక రవాణాకు అనుమతి ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే నిబంధనలు తుంగలో కలిపేసి అధికారాన్ని అడ్డుపెట్టుకుని తవ్వకాలు సాగించారు.



కర్నూలు జిల్లా హోళగుంద సమీపంలో వేదవతి నదిలో ఇసుక అక్రమ తవ్వకాలు(ఫైల్)

మంత్రి అండతో తవ్వకాలు

టీడీపీ హయాంలో వేదవది నదిపై 'వేదవతి ఎత్తిపోతల ప్రాజెక్టు' నిర్మించి లక్ష ఎకరాలకు సాగునీరు, పలు గ్రామాలకు తాగునీరు ఇవ్వాలనే ఆశయంతో రూ.1,986 కోట్లు మంజూరు చేశారు. టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి పనులకు శ్రీకారం చుట్టారు. ఆ తర్వాత అధికారం చేపట్టిన మంత్రి గుమ్మనూరు జయరాం ఈ ప్రాజెక్టును నిర్మించలేదు కానీ.. ఆయన సోదరుడు, వైసీపీ కీలక నాయకుడు ఒకరు నదిలో ఇసుక నిల్వలపై కన్నేశాడు. ఆయన అండతో ఇసుక మాఫియా పెట్రేగిపోయి ఇష్టానుసారంగా తవ్వకాలు సాగించింది. మార్లమడికి నుంచి రోజుకు 200 నుంచి 300 ట్రాక్టర్ల ఇసుకను(ట్రాక్టర్ 4.5 టన్నులు) అక్రమంగా తవ్వి ఆలూరు, ఆస్పరి, ఆదోని వంటి ప్రాంతాలకు అక్రమ రవాణా చేశారని స్థానికులు అంటున్నారు. ఈ 3 అనధికారిక రీచ్‌ల నుంచి రోజుకు సగటున 250 ట్రాక్టర్లు అక్రమంగా ఇసుక రవాణా అయ్యేదని అంటున్నారు. ప్రభుత్వం టన్ను ఇసుక ధర రూ.475గా నిర్ణయించింది. ఈ లెక్కన 250 ట్రాక్టర్లకు రోజుకు రూ.5.35లక్షలు చొప్పున ఈ ఐదేళ్లలో రూ.కోట్లు విలువ చేసే ఇసుకను కొల్లగొట్టారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తుంగభద్ర ప్రాజెక్టు బోర్డు పర్యవేక్షణలో రూ.519 కోట్లతో ఎల్లెల్సీ ఆధునీకరణ పనులు జరిగాయి. 2022లో జరిగిన ఎల్లెల్సీ టెండర్లను తన వర్గీయులకు ఇప్పించుకోవడంలో మంత్రి జయరాం చక్రం తిప్పారని తెలిసింది.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

పాతకోటయ్య స్వామి ఆలయం వరకు మెట్లమార్గం నిర్మాణం చేపడతాం: గోపిరెడ్డి

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 25: ప్రముఖ శైవక్షేత్రమైన కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి ఆలయం వద్ద నుంచి పాతకోటయ్యస్వామి ఆలయం వరకు నూతన మెట్ల మార్గం నిర్మాణం చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. పాతకోటయ్య స్వామి దేవస్థానం మెట్లమార్గం, అభివృద్ధి కమిటీని ఆదివారం నియమించారు. కమిటీ ప్రెసిడెంట్‌గా గంగుల వెంకటేశ్వరరెడ్డి, సెక్రటరీగా యిండ్ల కోటేశ్వరరావు, ట్రెజరర్‌గా కొత్తూరి గోపి, వైస్ ప్రెసిడెంట్‌లుగా తేళ్ళ సుధీర్, ముక్కు వెంకటేశ్వరరెడ్డి, బత్తుల విష్ణు, జాయింట్ సెక్రటరీలుగా తాళ్ళ వెంకట కోటిరెడ్డి, చిన్ని శ్రీనివాసరావు, సభ్యులుగా వేముల వెంకటరావు, దివ్వెల సురేష్ తదితరులు నూతన కమిటీ సభ్యులుగా నియమితులయ్యారు. నూతనంగా ఎంపికైన కమిటీ సభ్యులను ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అభినందించారు. నూతన కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ముస్లింల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి

● ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 25: రాష్ట్రంలో ముస్లింల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. పట్టణంలోని పల్నాడు బస్టాండ్ సమీపంలోని పెదచెరువులో కలెక్టర్ బంగ్లా వెనుక నూతనంగా నిర్మించిన ముస్లిం సద్భావన్ (కమ్యూనిటీ హాలు)ను ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆదివారం ప్రారంభించారు. అనంతరం బరంపేటలోని సరస్వతి శిశుమందిరంలో లైన్స్‌క్లబ్ ఆఫ్ నరసరావుపేట ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈ వైద్యశిబిరంలో హైదరాబాద్‌కు చెందిన ఏషియన్ వ్యాస్కులర్ హాస్పటల్‌కు చెందిన వైద్యులు పాల్గొని 300మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లైన్స్‌క్లబ్ సభ్యులు రత్నాకరం వరప్రసాద్, రాయవరపు సురేష్, రాము, అరిపిరాల రవి ప్రసాద్, మద్ది బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.



కనమర్లపూడిలో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

అన్నివర్గాలకు న్యాయంచేసిన ఘనత చంద్రబాబుదే

● జిల్లా తెలుగు రైతు ఉపాధ్యక్షుడు హనుమంతరావు

కనమర్లపూడి (శావల్యాపురం) ఫిబ్రవరి 25: గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అన్నివర్గాల పేదలను ఆదుకునేందుకు సంక్షేమ పథకాలను రూపొందించి అందరికీ న్యాయంచేసిన ఘనత చంద్రబాబుదేనని జిల్లా తెలుగురైతు ఉపాధ్యక్షుడు గోరంట్ల హనుమంతరావు అన్నారు. జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆదేశాల మేరకు ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని మండలంలోని కనమర్లపూడిలో శనివారం రాత్రి నిర్వహించారు. టీడీపీ మండలాధ్యక్షుడు గుంటూరు సాంబశివరావు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఇంటింటికీ తిరిగి ఉమ్మడి మినీ మ్యానిఫెస్టోలోని ఆరు పథకాలను ప్రజలకు వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. వినుకొండ నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు బోడెపూడి శంకర్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అనుసరించిన ప్రజా వ్యతిరేక విధానాలతో పేదలకు తీరని అన్యాయం జరిగిందని, వచ్చే ఎన్నికలలో టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వాన్ని గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందన్నారు. గ్రామపార్టీ అధ్యక్షుడు పూరేటి నరసింహారావు, తెలుగు యువత మందపాటి రమణ, టీడీపీ సీనియర్ నేతలు గడిపూడి విశ్వనాథం, యరమాసు కోటేశ్వరరావు, గద్దె వీరమస్తాన్‌రావు, చింతా గంగయ్య, ముక్కపాటి నాగేశ్వరరావు, బోడెపూడి వెంకటేశ్వర్లు, కాసరగడ్డ వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేలో పాతిన హద్దురాళ్ళ వివరాలివ్వండి

● సమాచార హక్కు చట్టం ద్వారా తహసీల్దార్‌కు దరఖాస్తు

శావల్యాపురం, ఫిబ్రవరి 24: ప్రభుత్వం చేపట్టిన రీసర్వేలో భాగంగా ప్రభుత్వ భూములు, రైతుల పొలాల మధ్య హద్దులు నిర్ణయించేందుకు ఏర్పాటుచేసిన హద్దురాళ్ళ వివరాలు తెలియజేయాలని సమాచారం హక్కుల చట్టం ద్వారా తహసీల్దార్ నక్కా లక్ష్మీలావణ్యను కోరినట్లు మండలంలోని గుంటుపాలెం గ్రామానికి చెందిన అన్నవరపు నరేంద్ర ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ రీసర్వేలో హద్దురాళ్ళు పాతించిన కూలీలలో అక్రమాలు జరిగినట్లు తమవద్ద ఆధారాలున్నాయని, అందుకే ఆర్టీయాక్ట్ ద్వారా అధికారులను వివరాలు కోరామన్నారు. మండలంలోని కనమర్లపూడి, పోట్లూరు, వేల్పూరు, పిచికలపాలెం, శానంపూడి రెవెన్యూ గ్రామాల్లో ప్రస్తుతం రీసర్వే పూర్తికాగా ఒక్కో రెవెన్యూ గ్రామానికి ప్రభుత్వం ఎన్ని హద్దురాళ్ళు కేటాయించింది, ఒక్కో హద్దురాయి పాతేందుకు కూలీలకు ప్రభుత్వం ఎంత నగదు కేటాయించింది, కూలీలకు ఎంత చెల్లించారో వివరాలు తెలియజేయాలని, కూలీలకు చెల్లించిన నగదుకు వారి సంతకాలతో కూడిన రసీదుల జిరాక్స్‌లు త్వరలో అందజేయాలని తహసీల్దార్‌ను కోరామన్నారు.

అగ్ని బాధితుడికి అరవిందబాబు ఆర్థికసాయం

రొంపిచర్ల, ఫిబ్రవరి 25: మండలంలోని సంతగుడిపాడు గ్రామానికి చెందిన రామకోటయ్యకు చెందిన ఇల్లు ఇటీవల షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమైంది. విషయం తెలుసుకున్న టీడీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆదివారం రామ కోటయ్యకు రూ.ఐదువేలు ఆర్థికసాయాన్ని, నిత్యావసర సరుకులను అందించారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మెట్టు వెంకటేశ్వరరెడ్డి, పల్లెల నాగిరెడ్డి, మోదుగుల కొండలు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

కోటప్పకొండలో అన్నదాన పథకానికి రూ.1,00,116/- విరాళం



అన్నదానం కోసం విరాళం అందజేస్తున్న దాతలు

కోటప్పకొండ (నరసరావుపేట రూరల్), ఫిబ్రవరి 25: ప్రముఖ శైవ క్షేత్రమైన కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి సన్నిధిలో నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి విజయవాడకు చెందిన యలవర్తి పద్మజ వారి కుమారుడు శశిదర్ రూ 1,00,116/- విరాళాన్ని ఆలయ కార్యనిర్వహణ అధికారి గోలగముడి శ్రీనివాసరెడ్డికి అందజేశారు. ఆలయంలో ఆదివారం త్రికోటేశ్వరస్వామికి నిర్వహించిన ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాల్లో దాతలు యలవర్తి పద్మజ వారి కుమారుడు శశిధర్ పాల్గొన్నారు. ఆలయ అర్చకులు స్వామివారి శేషవస్త్రం, చిత్రపటాన్ని, తీర్థప్రసాదాలను దాతలకు అందజేశారు.

బ్యాంకుల్లో మార్పులను అవగాహన చేసుకోవాలి

● ఏపీయుబీఈఏ ప్రధాన కార్యదర్శి ఉదయ్‌కుమార్

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 25: బ్యాంకులలో జరుగుతున్న మార్పులను అవగాహన చేసుకుంటూ, ఉద్యోగ భద్రతను దృష్టిలో ఉంచుకొని వినియోగదారునికి సేవలు అందించాలని ఏపీయూబీఈఏ ప్రధాన కార్యదర్శి ఉదయ్‌కుమార్ అన్నారు. జిల్లాల విభజన ఫలితంగా నరసరావుపేట రీజియన్ కొత్తగా ఏర్పాటు చేయటంతో యూనియన్ బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ సమావేశం పట్టణంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ప్రభుత్వ ఉద్యోగ వ్యతిరేక విధానాన్ని నిరసిస్తూ బ్యాంకింగ్ వ్యవస్థలో ఉద్దేశ్యపూర్వకంగా రుణ ఎగవేతదారులైన కార్పొరేట్ పేర్లను బహిరంగంగా ప్రకటించాలన్నారు. వారి ప్రైవేట్ ఆస్తులను జప్తుచేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు. ప్రత్యేక అతిథిగా హాజరైన డీజీఎం డీ శంకరరావు మాట్లాడుతూ నరసరావుపేట యూనియన్ బ్యాంక్ ఉద్యోగులను, కార్యక్రమాన్ని నిర్వహించిన ఏపీయూబీఈఏ నాయకత్వాన్ని ప్రశంసించారు. బ్యాంక్ అభివృద్ధి కోసం అందరూ కలిసికట్టుగా కృషిచేసి వినియోదారులకు సేవలందిస్తూ నరసరావుపేట రీజియన్ యూనియన్ బ్యాంక్ ప్రథమ స్థానంలో నిలపాలన్నారు. కార్యక్రమంలో ఏపీయూబీఈఏ చైర్మన్ పీ విజయ్ భాస్కర్, సెక్రటరీ వీ శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్ విశాలాక్షి, విజయక్రాంతి, జాయింట్ సెక్రటరీ నాగపావని, విజయవాడ, గుంటూరు, నరసరావుపేట రీజినల్ సెక్రటరీలు సుబ్బారావు, వేణు, బీ శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌వో ప్లాంట్ ప్రారంభం

నూజెండ్ల, ఫిబ్రవరి 25: మండలంలోని త్రిపురాపురంలో బాల వికాస్ ఆర్‌వో ప్లాంట్‌ను ఆదివారం వైసీపీ రాష్ట్ర ట్రేడ్ యూనియన్ సెక్రటరీ జెక్కిరెడ్డి ప్రభాకర రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ సురక్షితమైన తాగునీరు ప్రతి కుటుంబానికి అవసరమన్నారు. గ్రామస్థులు ఆర్‌వో ప్లాంట్ నిర్వాహణపై ప్రత్యేకశ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గొట్ట బ్రహ్మారెడ్డి, బాల వికాస్ మేనేజర్ మోహన్‌రెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో నాశిరకంగా పనులు

● కాలనీలో ప్రారంభానికి ముందే ఊడిపోతున్న సిమెంటు
● కొన్నిచోట్ల బయటపడుతున్న ఊచలు
● అధికారులు, కాంట్రాక్టర్లతో కుమ్మక్కు



జగనన్న కాలనీలో 1627 నంబరు ఇంట్లో నాశిరకం నిర్మాణ పనులతో గోడలకు పడిన రంధ్రాలు, 1610 గృహప్రవేశానికి ముందు పిల్లర్స్ స్థానంలో ఊడిపడుతున్న మట్టి

వినుకొండ టౌన్, ఫిబ్రవరి 25: వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పట్టణంలోని నిరుపేదలకు జగనన్న కాలనీ నిర్మాణ పనులు చేపట్టారు. కొంతకాలంగా లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలకు ఆసక్తి చూపకపోవడంతో అధికారులు ఎట్టకేలకు కాంట్రాక్టర్ల ద్వారా ఇంటి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఇంటి నిర్మాణాల్లో నాణ్యత కొరవడకుండా సచివాలయ ఇంజనీరింగ్ సిబ్బందితో పాటు హౌసింగ్ అధికారుల పర్యవేక్షణలో ఇంటి నిర్మాణ పనులు సాగుతున్నాయి. జాలలపాలెం సమీపంలోని 1600 సీరియల్‌లో ఇంటి నిర్మాణాల్లో నాశిరక ఇంటి నిర్మాణాలు కొట్టొచ్చినట్లు దర్శనమిస్తున్నాయి. వాటి ఫోటోలను పరిశీలిస్తే పేదలపై ప్రభుత్వానికి, పర్యవేక్షణ అధికారులకు ఎంత ప్రేమ ఉండి ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారో అర్థమవుతుంది. ఇంటి నిర్మాణంలో బేస్‌మెంట్ బెడ్‌కాంక్రీట్ పనులకు 6 పిల్లర్స్‌ను ఏర్పాటు చేసిన అధికారులు నిర్మాణంలో మాత్రం కనిపించడం లేదు. ఇంటి ప్రధాన గడప ప్లాస్టింగ్ పూర్తి చేసి రంగులు వేశారే తప్ప ఇంటి వెలుపల వైపు ప్లాస్టింగ్ చేయకపోవడంతో ఇంట్లో నుంచి సూర్యుని చూడవచ్చు అన్నట్లుగా పనులు పూర్తి చేసి మమ అని చేతులు దులుపుకుంటున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు జగనన్న కాలనీల ఇంటి నిర్మాణ పనుల్లో నాణ్యత పరిమాణాలతో ఇంటి పనులు చేపట్టి పేదలకు పదికాలాలపాటు నివాసానికి యోగ్యమైన ఇంటి పనులు చేపట్టాలని కోరుతున్నారు. ఈ విషయంపై హౌసింగ్ డీఈ శ్రీనివాసరావును వివరణ కోరగా జగనన్న కాలనీల్లోని ఇళ్ల నిర్మాణాల్లో నాశిరక పనులు జరుగుతున్న ప్రాంతాన్ని త్వరలో పరిశీలించి నాణ్యతాప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

టీడీపీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించాలి

● పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు



ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు

వినుకొండ, ఫిబ్రవరి 25: టీడీపీ ప్రకటించిన మేనిఫెస్టోను ప్రజలకు వివరించాలని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. పట్టణంలోని గంగినేని ఫంక్షన్ హాల్‌లో ఆదివారం కుటుంబసాధికార సారథులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. తొలుత ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు లిస్ట్‌పై అప్రమత్తంగా ఉండాలని, వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అరాచక పాలన గురించి ప్రజలకు తెలియజేయాలని, చంద్రబాబు ప్రకటించిన తల్లికి వందనం పేరుతో ఏటా ప్రతి విద్యార్థికి రూ.15వేలు, ఆడబిడ్డ నిధి పథకం ద్వారా ప్రతి స్త్రీకి నెలకు రూ.1500లు, దీపం పథకం ద్వారా సంవత్సరానికి మూడు గ్యాస్ సిలెండర్లు ఉచితం, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వంటి కార్యక్రమాల గురించి ప్రతి ఇంటికి తిరుగుతూ వివరించాలని కోరారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసనమండలి పార్లమెంటు కోఆర్డినేటర్ వెంపాడ చిరంజీవి రావు మాట్లాడుతూ టీడీపీ గెలుపే లక్ష్యంగా సాధికారులు పనిచేయాలని, వాస్తవాలను ప్రజలకు తెలియ చెప్పాల్సిన బాధ్యత మనపై ఉందని, అందరం కష్టపడి టీడీపీ, జనసేన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాదినేని ఆంజనేయులు, వీరగంధం ఆనంద్, మాదాల చిరంజీవి, కృష్ణ, యర్రం అంజిరెడ్డి, మక్కెన కొండలు, చింత ఆదిరెడ్డి, మద్దుకూరు రాంబ్రహ్మం, వజ్రాల కృష్ణారెడ్డి, ముత్తినేని ఏడుకొండలు, ఆకుమళ్ల ఖాశీం, కర్నాటి వెంకటరెడ్డి, బోడెపూడి గోవిందరాజులు, చల్లా ప్రసాద్, మద్దుల వెంకటేశ్వరరెడ్డి, దారివేముల సుబ్బయ్య, కె.వెంకటనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ అవినీతిపరులను ఇంటికి పంపటం ఖాయం

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు



ప్రత్తిపాటి నివాసం వద్దకు భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 25: తెలుగుదేశం, జనసేన శ్రేణులంతా మరో రెండు నెలలు కష్టపడితే వైసీపీని, అందులోని అవినీతి ప్రజాప్రతినిధులను ఇంటికి పంపించటం ఖాయమని మాజీ మంత్రి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. తెలుగుదేశం, జనసేన కూటమి తొలి జాబితా దెబ్బకే తాడేపల్లి ప్యాలెస్‌లో ప్రకంపనలు మొదలయ్యాయని ఆయన ఎద్దేవా చేశారు. పార్టీ చరిత్రలోనే మొదటిసారి ఇంతముందుగా ఒకేసారి 94మంది అభ్యర్థులను ప్రకటించటం ద్వారా టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రత్యర్థులకు కఠిన సంకేతాలు పంపారని, తన అభ్యర్థిత్వం ఖరారుతో స్థానికంగా అవాకులు, చెవాకులు పేలుతున్న వారికి సమాధానం చెప్పినట్లయిందన్నారు. చిలకలూరిపేట నుంచి ప్రత్తిపాటి అభ్యర్థిత్వం ఖరారైన సందర్భంగా టీడీపీ జనసేన శ్రేణులు భారీ స్వాగత ర్యాలీలు నిర్వహించారు. నియోజకవర్గ ముఖద్వారం బోయపాలెం నుంచి భారీగా ద్విచక్ర వాహనాలు, కార్లతో బాణసంచా సందడి మధ్య ర్యాలీతో స్వాగతం పలికారు. ముందుగా బోయపాలెం పార్వతీ అమ్మవారి దేవాలయంలో పూజలు నిర్వహించారు. రాత్రి సమయంలో కూడా కార్యకర్తలు భారీగా తరలిరావటంతో టీడీపీ శ్రేణుల ఆనందానికి హద్దులు లేకుండా పోయింది. ర్యాలీ అనంతరం ప్రత్తిపాటి ఇంటి వద్ద కార్యకర్తలతో మాట్లాడుతూ చిలకలూరిపేట ప్రాంత ప్రజల రుణం తీర్చుకోవటమే తన లక్ష్యమన్నారు. కాగా పట్టణానికి చెందిన ఆర్యవైశ్య ప్రముఖులు ప్రత్తిపాటిని కలసి అభినందనలు తెలియచేసి ప్రత్తిపాటి విజయానికి ఏకతాటిపై కృషి చేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త తోట రాజారమేష్, భారీ సంఖ్యలో టీడీపీ, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రత్తిపాటికి ఘన స్వాగతం

యడ్లపాడు, ఫిబ్రవరి 25: చిలకలూరిపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా తెలుగుదేశంపార్టీ మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు పేరును ఖరారు చేయడంతో ఆ పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం వెల్లి విరిసింది. అభ్యర్థుల ప్రకటన అనంతరం శనివారం సాయంత్రం మంగళగిరి నుంచి చిలకలూరిపేటకు వస్తున్న ప్రత్తిపాటికి నియోజకవర్గ ముఖద్వారమైన బోయపాలెం వద్ద టీడీపీ, జనసేనపార్టీల నాయకులు, అభిమానులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. భారీగా బాణాసంచా కాల్చి హర్షాతిరేకాలను తెలియజేశారు. స్థానిక పార్వతీదేవి ఆలయంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త తోట రాజారమేష్‌తో కలసి పార్వతీదేవి ఆలయంలో పూజలు చేశారు.

తెలుగుదేశం, జనసేన ప్రభుత్వ ఏర్పాటు కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 25: తెలుగుదేశం, జనసేన కూటమి అధికారంలోకి రావాలని రాష్ట్ర ప్రజలందరూ కోరుకుంటున్నారని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. సూపర్ - 6 హామీలు చంద్రబాబు నాయుడు నాయకత్వంలో చూసిన సంక్షేమం, అభివృద్ధే వారిని ఈ దిశగా ఏకంచేస్తున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. పట్టణంలోని 7వ వార్డులో ఆదివారం బూత్ కమిటీ కుటుంబ సాధికార సారథులు టీడీపీ, జనసేన ముఖ్య నాయకులతో సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలో మంచి మెజార్టీ వచ్చేందుకు ప్రతిఒక్కరూ కలసి కట్టుగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త తోట రాజారమేష్, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రత్తిపాటి ఫౌండేషన్ ఆర్థిక సాయం

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 25: పట్టణంలోని 23వ వార్డుకు చెందిన పులా వేణుగోపాల్ ఇటీవల మరణించాడు. విషయం తెలుసుకున్న మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు వారి కుటుంబానికి సానుభూతి తెలియజేసి ప్రత్తిపాటి ఫౌండేషన్ ద్వారా వారికి రూ.10వేలు ఆర్థిక సాయాన్ని టీడీపీ నాయకుల ద్వారా అందజేశారు.

ఆర్టీసీ ఉద్యోగులకు వైద్యసౌకర్యాలు కల్పించాలి

● ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు



సమావేశంలో మాట్లాడుతున్న దామోదరరావు

వినుకొండ, ఫిబ్రవరి 25: ఆర్టీసీ ఉద్యోగులకు విలీనం ముందు ఉన్న పద్ధతిలో వైద్యసౌకర్యాలు కల్పించాలని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు అన్నారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆర్టీసీ డిపో ఎంప్లాయిస్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం ఆదివారం జరిగింది. తొలుత ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో జెండా ఆవిష్కరించి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న దామోదరరావు మాట్లాడుతూ ఆర్టీసీని విలీనం చేయక ముందు ఉన్న వైద్యసౌకర్యాల కల్పనతో పాటు కొన్ని అలవెన్స్, ఇన్సెంట్ స్కీమ్‌లను పాత పద్ధతిలో లేకుండా ఈహెచ్ఎస్ ద్వారా సరైన వైద్య సౌకర్యాలు అందక ఉద్యోగులు అసంతృప్తిగా ఉన్నారన్నారు. విలీనానికి ముందు జీతంతో పాటు చెల్లింపులుచేసి, విలీనం అనంతరం నిలిపివేసిన ఓవర్‌టైమ్ డ్యూటీ అలవెన్స్‌లను జీతంతో చెల్లింపులు జరిగేలా ఆదేశాలు ఇప్పించాలన్నారు. ఈ నెల నుంచి నైట్ హాల్ట్ డ్యూటీ అలవెన్స్‌లను కూడా చెల్లించాలని, 2017 పీఆర్‌సీ బకాయిలు వేగవంతం చేసేందుకు ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు సహకారంతో రాష్ట్ర కమిటీ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఉపాధ్యక్షుడు మందపాటి శంకరరావు మాట్లాడుతూ ఆర్టీసీ అధికారులు కొంతమంది ఇష్టానుసారంగా పనిష్మెంట్లు ఇస్తున్నారని, అందరికీ సమానన్యాయం జరగడం లేదన్న అభిప్రాయంతో 2019 సంవత్సరంలో ఈయూ గుర్తింపు కాలంలోనే ఉద్యోగ భద్రత ఉండేలా సర్క్యులర్ నంబరు 01/2019ఇప్పించామని, కాని కొంతమంది అధికారులు ఈ సర్క్యులర్‌ను పక్కనపెట్టి సస్పెండ్‌లు, తొలగించడం చేస్తున్నారని, దీనిని తీవ్రంగా ఖండిస్తూ రాష్ట్ర కమిటీ తరఫున ఎండీకి లేఖ ఇవ్వడం జరిగిందన్నారు. సమావేశంలో ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు వాకా రమేష్, ఎన్.కోటేశ్వరరావు, బి.కోటేశ్వరరావు, ఎస్‌కే ఖాజా, జి.టి.రావు, ఎస్‌కే.హనీఫ్, ఎం.పాపయ్య, కె.హరిబాబు, విన్సెంట్, పి.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ

ఇనుమెళ్ళ (ఈపూరు) ఫిబ్రవరి 25: మండలంలోని ఇనుమెళ్ళలో గోనుగుంట్ల సత్యన్నారాయణ మెమోరియల్ సారథ్యంలో శివశక్తి లీలా అండ్ అంజన్ ఫౌండేషన్ తరపున ఇంటర్ ఆపై చదువుతున్న విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందజేశారు. గ్రామంలోని 160మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. ఇనుమెళ్ళ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పాల్గొని స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ గ్రామంలో అభివృద్ధి పనులకు తనవంతు కృషి చేస్తున్నాన్నారు. కార్యక్రమంలో రాపర్ల జగ్గారావు, తిరుమలశెట్టి బాలయ్య, వీరయ్య, లక్ష్మీనారాయణ, ఐనాల కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్ విజ్ఞాన కేంద్రంలో కుట్టు మిషన్ కేంద్రం ప్రారంభం

యడ్లపాడు, ఫిబ్రవరి 25: మండల కేంద్రమైన యడ్లపాడులోని పీఆర్ విజ్ఞాన కేంద్రంలో కుట్టు మిషన్ కేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. తానా ఫౌండేషన్ అధ్యక్షులు యార్లగడ్డ వెంకటరమణ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని నారాయణ ఇంగ్లీషు మీడియం స్కూల్ ప్రిన్సిపాల్ చెరుకూరి సృజన ప్రారంభించారు. ఈ సందర్భం పీఆర్ విజ్ఞాన కేంద్రం బాధ్యుడు నూతలపాటి కాళిదాసు మాట్లాడుతూ కుట్లు, అల్లికల్లో శిక్షణ పొంది ఆర్థిక వెసులుబాటు లేక కుట్టుమిషన్ కొనుగోలు చేసుకునేందుకు అవకాశం లేని మహిళల కోసం ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కేంద్రానికి తానా ఫౌండేషన్ వారు మూడు కుట్టు మిషన్‌లను అందజేశారన్నారు. శిక్షణ పొందిన మహిళలు ఈ కేంద్రానికి వచ్చి ఎటువంటి రుసుము చెల్లించకుండానే బట్టలు కుట్టుకుని ఉపాధి పొందవచ్చన్నారు. కుట్టు మిషన్లు అందజేసిన తానా ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. యడ్లపాడు గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు కె రాంబ్రహ్మం, ముత్తవరపు రవీంద్ర, విజ్ఞానకేంద్రం బాధ్యులు ముత్తవరపు పద్మారావు, నూతలపాటి విజయలక్ష్మి, కల్లూరి కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.



నిర్వాహకుల నుంచి బహుమతులు అందుకుంటున్న విజేతలు

ముగిసిన నాలుగు జిల్లాల స్థాయి టెన్నిస్ పోటీలు

చిలకలూరిపేట, ఫిబ్రవరి 25: స్థానిక సీఆర్ క్లబ్‌లో టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగిన మెన్స్ డబుల్స్ టెన్నిస్ పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. ప్రకాశం, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలకు చెందిన 70 టెన్నిస్ టీమ్‌లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. మొత్తం నాలుగు విభాగాల్లో ఈ పోటీలు జరిగాయి. ప్రథమ స్థానంలో 45 సంవత్సరాల లోపు విభాగంలో చీరాలకు చెందిన కమల్, అర్జున్ జట్టు, 45 పైబడిన విభాగంలో నరసరావుపేటకు చెందిన కోటిరెడ్డి, డాక్టర్ దండమూడి వెంకటేశ్వరరావు జట్టు 55 సంవత్సరాలు పైబడిన విభాగంలో చిలకలూరిపేట సీఆర్ క్లబ్‌కు చెందిన డాక్టర్ లావు సతీష్, రసూల్ జట్టు 65 సంవత్సరాల పైబడిన విభాగంలో చిలకలూరిపేట సీఆర్ క్లబ్‌కు చెందిన సాధినేని హనుమంతరావు, పెరవలి కోటీరావు జట్టు ప్రథమ స్థానంలో విజయం సాధించాయి. ద్వితీయ స్థానంలో 45 సంవత్సరాలలోపు విభాగంలో చిలకలూరిపేట సీఆర్ క్లబ్‌కు చెందిన డాక్టర్ మక్కెన వంశీ, కే వంశీ జట్టు, 45 సంవత్సరాల పైబడిన విభాగంలో చిలకలూరిపేట సీఆర్ క్లబ్‌కు చెందిన స్వర్ణ శ్రీను, డాక్టర్ కొండారెడ్డి జట్టు, 55 సంవత్సరాలు పైబడిన విభాగంలో ఒంగోలుకు చెందిన రామకృష్ణారెడ్డి, అల్లు సత్యనారాయణ జట్టు, 65సంవత్సరాలు పైబడిన విభాగంలో చిలకలూరిపేట సీఆర్ క్లబ్‌కు చెందిన డాక్టర్ సీహెచ్ రత్తయ్య చౌదరి, కోటేశ్వరరావు జట్టు విజయం సాధించాయి. విజేతలకు బీ నరేంద్ర, డాక్టర్ మోహనరెడ్డి, డాక్టర్ పీవీరావు తదితరులు బహుమతి ప్రదానం చేశారు. ఈ పోటీల సందర్భంగా సీఆర్ క్లబ్ యాజమాన్యం విస్తృతంగా ఏర్పాట్లు చేశారు.



రొంపిచర్లలో ప్రచారంలో పాల్గొన్న అరవింద బాబు, గోనుగుంట్ల కోటేశ్వరరావు తదితరులు

టీడీపీ అభ్యర్థుల ప్రకటనతో వైసీపీ నేతల్లో గుబులు

రొంపిచర్ల, ఫిబ్రవరి 25: టీడీపీ, జనసేన అభ్యర్థుల ప్రకటనతో వైసీపీ నేతల్లో గుబులు పట్టుకుందని టీడీపీ ఇన్‌చార్జ్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. మండలంలోని రొంపిచర్లలో రెండోరోజు బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తుందని తెలిపారు. మేనిఫెస్టో గురించి వివరించారు. రాష్ట్రంలో అభివృద్ధి జరగాలన్నా, యువతకు ఉద్యోగాలు రావాలన్నా టీడీపీ అధికారంలోకి రావాలన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి జరగలేదని, అవినీతి మాత్రమే జరిగిందని ఆయన ఆరోపించారు. అభ్యర్థుల విషయంలో వైసీపీకి క్లారిటీ లేదన్నారు. రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి గోనుగుంట్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ప్రకటించిన అభ్యర్థులు 90శాతం మేర గెలుస్తారని తెలిపారు. రొంపిచర్ల మండలంలో తెలుగుదేశం పార్టీకి మెజార్టీ వస్తుందన్నారు. నల్లపాటి రాము మాట్లాడుతూ రోజురోజుకు తెలుగుదేశం పార్టీకి ఆదరణ పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కడియాల లలిత సాగర్, పులుకూరి జగ్గయ్య, పల్లెల నాగిరెడ్డి, కల్లి మల్లారెడ్డి, గంగిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మందలపు వెంకటరత్నం, నెల్లూరి పాపారావు, కోనేటి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు 'ఎ' సర్టిఫికెట్ పరీక్ష

నాదెండ్ల, ఫిబ్రవరి 25: నియోజక వర్గంలోని పలు పాఠశాలలకు చెందిన ఎన్‌సీసీ విద్యార్థులకు గణపవరంలోని సీఆర్ కళాశాలలో 'ఎ' సర్టిఫికెట్ పరీక్షలు ఆదివారం నిర్వహించారు. మురికిపూడి ఉన్నత పాఠశాల, శారదా ఉన్నత పాఠశాల, వేదా స్కూల్, జవహర్ నవోదయ స్కూళ్ళకు చెందిన 246 మంది విద్యార్థులకు 236 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షలను సీవో కల్నల్ సీఎస్ సింధు, లెఫ్టినెంట్ కల్నల్ దీపక్ కుమార్ శర్మలు పర్యవేక్షించారు.

వైద్య శిబిరంలో మూడు వందల మందికి పరీక్షలు

నాదెండ్ల, ఫిబ్రవరి 25: మండలంలోని సాతులూరు గ్రామంలోని వేణుగోపాల స్వామి దేవాలయంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఐనవోలు రాధాకృష్ణ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. నరసరావుపేటకు చెందిన వరబాబు, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ గంగూరి సుప్రజ, డాక్టర్ చెరుకూరి రవితేజ, డాక్టర్ యలవర్తి వరబాబులు మూడువందల మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. శిబిరాన్ని పసుమర్తి శివనాగేశ్వరరావు, ఐనవోలు హనుమంతరావు, ఐనవోలు రాజా, మణిదీప్, అనీల్ కుమార్, పబ్బిశెట్టి సత్యనారాయణ తదితరులు పర్యవేక్షించారు.

240మందికి షుగర్, బీపీ పరీక్షలు

యడ్లపాడు, ఫిబ్రవరి 25: యడ్లపాడు అభివృద్ధి కమిటీ, లింగారావుపాలెం విజన్ ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో షుగర్, బీపీ వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. స్థానిక పీఆర్ విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన ఈ శిబిరానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్యశాఖ మాజీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.నాగేశ్వరరావు, జూనియర్ డాక్టర్లు గుంటుపల్లి భవ్యతేజ, చెన్నుపాటి తేజశ్రీ, శొంఠినేని నవ్యశ్రీలు హాజరై వైద్య సేవలు అందించారు. శిబిరానికి హాజరైన 240మందిని పరీక్షించి సలహాలు, సూచనలు అందించడంతోపాటు మందులను పంపిణీ చేశారు. కార్యక్రమాలను అభివృద్ధి కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

బీజేపీ నేత రంగిశెట్టి రామకృష్ణపై దాడి

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 25: నరసరావుపేట బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ పట్టణానికి చెందిన రంగిశెట్టి రామకృష్ణపై మండలంలోని అల్లూరివారిపాలెంలో ఆదివారం రాత్రి దాడి జరిగింది. వివరాలు ఈ విధంగా ఉన్నాయి. బీజేపీ జాతీయ, రాష్ట్ర నాయకత్వాల పిలుపుమేరకు నియోజకవర్గంలో నిర్వహిస్తున్న ప్రజాపోరు యాత్రలో భాగంగా పార్టీ కార్యక్రమాలను తెలియపరుస్తూ అల్లూరివారిపాలెంలో నిర్వహిస్తుండగా గ్రామ ఎంపీటీసీ వెంకట అప్పారెడ్డి, ఆర్ఎంపీ జై భారత్‌రెడ్డిలు తమ నాయకులను, తనను, తమ పార్టీని దూషిస్తూ ప్రచార రథాన్ని ధ్వంసం చేశారని, ప్రశ్నించిన తనపై దాడి చేశారని రంగిశెట్టి రామకృష్ణ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా ఇదే విషయమై తమ ఇంటి ముందు న్యూసెన్స్‌గా ఉందని తెలపగా తనపై సుమారు పదిమంది బీజేపీ కార్యకర్తలు దాడిచేశారని వెంకటప్పారెడ్డి వైద్యశాలలో చికిత్స నిమిత్తం చేరి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ విషయమై రూరల్ ఎస్ఐ రోశయ్యను వివరణ కోరగా రెండు ఫిర్యాదులు వచ్చిన మాట వాస్తవమేనని, దర్యాప్తుచేసి చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గుంటుపాలెం పోలింగ్ కేంద్రాన్ని కొనసాగించండి: టీడీపీ నాయకులు

శావల్యాపురం, ఫిబ్రవరి 25: మండలంలోని గుంటుపాలెం ప్రాథమిక పాఠశాలలో గత 50ఏళ్లగా ఎన్నికలు నిర్వహిస్తున్న పోలింగ్ కేంద్రాన్ని అధికారపార్టీ నాయకుల ఒత్తిడి మేరకు పాఠశాల మూతపడిందని, వసతులు సక్రమంగా లేవని తప్పుడు కారణాలు చెప్పి గ్రామ సచివాలయంలోకి మార్చారని, దీనిపై అధికారులు పునఃపరిశీలన చేసి ప్రజలకు అందుబాటులోని ప్రాథమిక పాఠశాలలోనే పోలింగ్ కేంద్రాన్ని కొనసాగించాలని మండల టీడీపీ నాయకులు శనివారం సాయంత్రం కార్యాలయంలో తహసీల్దార్ లక్ష్మీలావణ్యను కలసి విన్నవించారు. టీడీపీ మండలాధ్యక్షుడు గుంటూరు సాంబశివరావు మాట్లాడుతూ వసతులు లేకపోతే అదే భవనంలో అంగనవాడీ కేంద్రాన్ని ఎలా నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు.

బీజేపీ ప్రజాపోరు కార్యక్రమం

వినుకొండ టౌన్, ఫిబ్రవరి 25: మండలంలోని ఉప్పరపాలెం గ్రామంతో పాటు పట్టణంలోని కారంపూడి రోడ్డులో భారతీయ జనతాపార్టీ ఆధ్వర్యంలో ప్రజాపోరు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ జనరల్ సెక్రటరీ మేడం రమేష్, గట్టుపల్లి శ్రీనివాసరావు, గొడవర్తి సుజాత, ఎండ్లూరి వీరయ్య, సుధాగణేష్, మాజేటి ప్రమీల, కాళంగి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.